


PRABHATA SURYA
ప్రభాత సూర్య
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
17-3-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 01
సంచిక: 196

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



2లో

# అసెంబ్లీలో తెలంగాణ తల్లి విగ్రహం

- ఆవిష్కరించిన నూతన గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- 'జయ జయహే తెలంగాణ'తో సమావేశాలు ప్రారంభం
- శాసనసభలో తొలిసారి 'వందేమాతరం' గేయాలాపన
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల రాకతో కళకళలాడిన ప్రాంగణం
- నేటి నుంచి టౌనహాల్‌లో శాసనమండలి సమావేశాలు
- ఒకే ప్రాంగణంతో రెండు సభలతో కోలాహలం

**హైదరాబాద్, ప్రభాత సూర్య :** రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో మరో నూతన ఘట్టం ఆవిష్కృతమైంది. ప్రభుత్వం 'తెలంగాణ తల్లి' విగ్రహాన్ని శాసనసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసింది. సోమవారం రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

# అభివృద్ధి దిశగా తెలంగాణ

- 'తెలంగాణ రైజింగ్2047'తో భవిష్యత్‌కు బలమైన పునాది
- ప్రపంచస్థాయి రాష్ట్రంగా తెలంగాణకు లక్ష్యం
- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం
- సమగ్రాభివృద్ధికి వికేంద్రీకృత వ్యూహం
- క్యూర్, ప్యూర్, రేర్ మోడల్‌తో అభివృద్ధి ప్రణాళిక
- భారీ పెట్టుబడులతో ఆర్థిక వృద్ధికి ఊతం
- రైతు సంక్షేమం, సంక్షేమ పథకాలపై దృష్టి
- ఐటీ, పరిశ్రమలతో తెలంగాణ గ్లోబల్ హబ్‌గా మారే దిశ
- ప్రజల భాగస్వామ్యంతో భవిష్యత్ తెలంగాణ నిర్మాణం



హైదరాబాద్, మార్చి 17: తెలంగాణను దేశంలోనే కాక ప్రపంచంలోనూ అభివృద్ధి చెందిన ప్రాంతంగా నిలబెట్టేందుకు ప్రభుత్వం పటిష్ట ప్రణాళికలతో ముందుకు సాగుతోందని గవర్నర్ శివప్రతాప్ శుక్లా తెలిపారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభ సందర్భంగా సోమవారం ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాదులు వేసేందుకు పలు సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు.

### 'తెలంగాణ రైజింగ్2047' విజన్

రాష్ట్ర అభివృద్ధిని దీర్ఘకాలికంగా ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్2047' విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించిందని గవర్నర్ పేర్కొన్నారు. 'వికసిత్ భారత్2047' దిశగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు.

### ఆర్థిక వ్యవస్థలో వృద్ధి

202526 నాటికి తెలంగాణ స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని గవర్నర్ వెల్లడించారు. దేశ జీడీపీలో రాష్ట్ర వాటా 4.99 శాతంగా ఉందన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కి పెరిగిందని చెప్పారు. ద్రవ్యోల్బణాన్ని కూడా ప్రభుత్వం నియంత్రణలో ఉంచిందని తెలిపారు.

### సమగ్రాభివృద్ధికి కొత్త వ్యూహం

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమతుల్యంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్), ప్యూర్ (పెరీ అర్బన్ రీజియన్), రేర్ (రూరల్ అగ్రి రీజియన్) మోడల్‌ను అమలు చేస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్‌కే పరిమితమైన అభివృద్ధి విధానాన్ని మార్చి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

### నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాలు

రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న పట్టణీకరణను దృష్టిలో ఉంచుకుని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను పునర్వ్యవస్థీకరించినట్లు గవర్నర్ చెప్పారు. సైబరాబాద్, మల్కాజిగిరి, హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించడం ద్వారా పరిపాలనను ప్రజలకు చేరువ చేయాలని ప్రభుత్వం

(మిగతా 2వ పేజీలో)



# ఇరాన్‌పై బాంబుల వర్షం

## దుబాయ్ ఎయిర్‌పోర్టు వద్ద కమ్ముకున్న పొగ

- డ్రోన్ ఫ్యాక్టరీలే లక్ష్యంగా దాడులు: ట్రంప్
- దెబ్బతిన్న ఇరాన్ రెడ్‌క్రాస్ సొసైటీ క్లినిక్
- తీవ్రస్థాయిలో ఇరాన్ ప్రతీకార దాడులు
- అధునాతన సెజ్జిల్ క్షిపణుల ప్రయోగం
- ఖతార్ నుంచి గ్యాస్‌తో వచ్చిన నౌక
- భారత్‌కు దక్కనున్న భారీ ఊరట

ముంద్రా, దుబాయ్/జెరూసలేం: పశ్చిమాసియాలో యుద్ధ కల్లోలం తీవ్రస్థాయిలో కొనసాగుతూనే ఉంది. ఇజ్రాయెల్––అమెరికా సోమవారం కూడా ఇరాన్‌పై భారీగా దాడులు కొనసాగించాయి.



2లో

# రాజ్యసభకు మందకృష్ణ మాదిగ!

- బిజెపి అనూహ్య నిర్ణయం
- తెలంగాణలో గెలుపు కోసం భారీ వ్యూహం
- గతంలో బీసీ నేత ఆర్ కృష్ణయ్య కు ఛాన్స్
- ఈసారి ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకుడుకు..

**హైదరాబాద్, ప్రభాత సూర్య**

బిజెపి ఒక అనూహ్య నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏపీ నుంచి ఖాళీ కాబోయే రాజ్యసభ పదవి నుంచి పార్టీ తరఫున ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగను పంపించినట్లు సమాచారం. దేశవ్యాప్తంగా జూన్లో 70 మంది రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. అందులో ఏపీ నుంచి నలుగురు ఉన్నారు. అయితే ఈ నాలుగు పదవులు కచ్చితంగా కూటమి ఖాతాలో పడతాయి. బిజెపికి ఒక రాజ్యసభ పదవి కేటాయిస్తారని తెలుస్తోంది. అలా ఆ స్థానంలో మందకృష్ణ మాదిగకు ఛాన్స్ ఇస్తారని సమాచారం. తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి కోసం బిజెపి ఈ నిర్ణయానికి వచ్చినట్లు కూడా తెలుస్తోంది.

# తెలంగాణ కవికి జాతీయ గౌరవం



నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

'అనిమేష' కవితా సంపుటికి ప్రతిష్టాత్మక పురస్కారం

# నీటి వివాదంపై సీఎం మౌనం ఎందుకు?



రేవంత్‌రెడ్డిని ప్రశ్నించిన హరీష్‌రావు

నీటి హక్కుల విషయంలో తెలంగాణకు అన్యాయం

గోదావరి జలాలపై ఏపీ కన్ను పడిందని వ్యాఖ్య



# ప్రత్యూష కేసులో కీలక మలుపు

నాంపల్లి కోర్టులో లొంగిపోయిన సిద్ధార్థరెడ్డి

అమెరికా నుంచి వచ్చి కోర్టులో సరెండర్

# కటక్ ఆస్పత్రిలో దారుణం

## ఐసియులో చెలరేగిన మంటలు.. పదిమంది రోగుల దుర్మరణం

**భువనేశ్వర్, ప్రభాత సూర్య :** ఒడిషాలోని కటక్ ఆస్పత్రి ఐసీయూలో అగ్నిప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో రోగులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. రోగులను ఐసీయూ నుంచి బయటికి తీసుకువెళ్లే క్రమంలో పలువురు సిబ్బందికి కూడా కాలిన గాయాలయ్యాయి. ఒడిశాలోని కటక్ సిటీ లోగల ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కటక్‌లోని ఎస్‌సీబీ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆస్పత్రి ట్రామా కేర్ విభాగం ఐసీయూలో ఆదివారం అర్ధరాత్రి మంటలు చెలరేగాయి.



2లో

# గవర్నర్ ప్రసంగం డొల్ల... చిత్తు కాగితంతో సమానం

- కొత్త గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించిన కాంగ్రెస్
- ఆరు గ్యారెంటీల ప్రస్తావన లేకుండా చేశారు
- మహిళలకు ఇస్తామన్న 2500 హామీ ఏమయ్యింది
- గవర్నర్ ప్రసంగంపై బిఆర్ఎస్ నేతల విమర్శలు

# రాజ్యసభకు మందకృష్ణ మాదిగ!

(మొదటి పేజీ తరువాయి)

గతంలో ఆర్ కృష్ణయ్య లాంటి బీసీ నేతకు రాజ్యసభకు పంపింది బిజెపి. ఇప్పుడు మందకృష్ణ మాదిగను పంపించడం ద్వారా మాదిగల మద్దతు కూడగట్టాలని చూస్తోంది.

**మాదిగలు అధికం..**

తెలంగాణలో మాదిగ సామాజిక వర్గం అధికం. ఎస్సీల్లో సింహభాగం అదే సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారు. మొన్ననే ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎస్సీ వర్గీకరణ జరిపింది. దీంతో మందకృష్ణ మాదిగ బిజెపి నాయకత్వానికి మరింత దగ్గరయ్యారు. ప్రధాని నరేంద్ర మోడీ ఏకంగా మందకృష్ణ మాదిగను ఆత్మీయంగా ఆలింగడం చేసుకున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఎస్సీ వర్గీకరణ కోసం దశాబ్దాలుగా పోరాడుతూ వచ్చారు మందకృష్ణ మాదిగ. ఎస్సీ రిజర్వేషన్ ఫలాలను ఒకటి రెండు కులాలు మాత్రమే అనుభవిస్తున్నాయని చెప్పి ఆ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. దీనిని గుర్తించింది బిజెపి నాయకత్వం. ఏపీలో తెలుగుదేశం సైతం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉండేది. ప్రస్తుతం ఎన్డీఏలో టిడిపి కీలక భాగస్వామి కావడంతో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదించింది కేంద్రం. దీంతో మరింత దగ్గర అయ్యారు బిజెపి నాయకత్వానికి మందకృష్ణ మాదిగ.



**గెలుపు,ఓటములు పై ప్రభావం..**

తెలంగాణలో మాదిగ సామాజిక వర్గం అధికం. అక్కడ ఎక్కువగా మాదిగలు ఉంటారు. దాదాపు 70, 80 నియోజకవర్గాల్లో గెలుపు ఓటములను ప్రభావితం చేయగలరు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి రావాలనుకుంటుంది భారతీయ జనతా పార్టీ. అందుకు ఏ అవకాశం వచ్చినా విడిచి పెట్టే ఛాన్స్ లేదు. ఇప్పటికే ఎస్సీ వర్గీకరణతో మాదిగల మనసు గెలుచుకుంది. ఇప్పుడు అదే మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగకు పదవి ఇస్తే మరింత ఉపయోగం అని భావిస్తోంది. కేవలం తెలంగాణలో మాత్రమే కాదు.. ఏపీలో సైతం మాదిగల తో పాటు ఎస్సి ఉప కులాలను తమ వైపు తిప్పుకోవాలని చూస్తోంది కూటమి ప్రభుత్వం. అందుకే బిజెపి రాజ్యసభ ప్రతిపాదనను చంద్రబాబు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

**సామాజిక వర్గ మద్దతు కోసం..**

మొన్నటికి మొన్న బీసీ నేత ఆర్ కృష్ణయ్యకు రాజ్యసభ పదవి ఇచ్చింది భారతీయ జనతా పార్టీ. అంతకుముందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అదే కృష్ణయకు రాజ్యసభ చాన్స్ ఇచ్చింది. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్ కృష్ణయ్యతో రాజీనామా చేయించి.. ఉప ఎన్నిక వచ్చేలా చేసింది. అలా కృష్ణయ్య మళ్ళీ బిజెపి ద్వారా రాజ్యసభకు ఎంపిక కావడం గమనార్హం. ఇప్పుడు మందకృష్ణ మాదిగను రాజ్యసభకు పంపించడం ద్వారా ఎస్సీ ఉప కులాలను తమ వైపు తిప్పుకోవాలని చూస్తోంది బిజెపి. అయితే బిజెపి పెద్దల విన్నపాన్ని సీఎం చంద్రబాబు కూడా అంగీకరించినట్లు తెలుస్తోంది. అతి త్వరలో అధికారిక ప్రకటన కూడా వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## నందినీ సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం



ప్రజా కవి నందిని సిధారెడ్డితోపాటు 24 భాషల రచయితలకు పురస్కారాలు ఇవ్వాలని గతేడాది డిసెంబరులో కేంద్ర సాహిత్య అకాడమీ కార్యవర్గం తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆమోదించింది. దజనకు పైగా కవితాసంపుటాలు, పలు గేయాలు, సాహితీ గ్రంథాలను రచించిన సిధారెడ్డి.. సిద్దిపేట జిల్లా బందారం గ్రామంలో 1955లో జన్మించారు. ఆధునిక కవిత్వంలో వాస్తవికత- అధివాస్తవికత అన్న అంశంపై ఉస్మానియా యూనివర్శిటీ నుండి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. సిద్దిపేట ప్రభుత్వ కళాశాలలో లెక్చరర్‌గా రిటైరయ్యారు. భూమి స్వప్నం, సంభాషణ, ప్రాణహిత కవితా సంకలనాలు కవిగా ఆయనకు మంచి పేరు తెచ్చాయి. తెలంగాణ రచయితల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్న సిధారెడ్డికి ఈ నెల 31న జరిగే కేంద్ర సాహిత్య అకాడమీ సాహిత్య ఉత్సవాల్లో రూ. లక్ష నగదు, తామ్ర పతాకం బహూకరిస్తారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారానికి సిధారెడ్డి కవితా సంకలనం ఎంపిక చేసిన న్యాయనిర్ణేతల బృందంలో ప్రముఖ రచయితలు మధురాంతకం నరేంద్ర, కోయి కోటేశ్వరరావు, ఎన్ గోపీ ఉన్నారు. కేంద్ర సాహితీ పురస్కారానికి ఎంపికైన సిధారెడ్డికి, తెలంగాణ పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రెండు తెలుగు రాష్ట?ట్రల మాజీ సీఎంలు కేసీఆర్, వైఎస్ జగన అభినందనలు తెలిపారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన జూలూరు గౌరీశంకర్ హర్షం వ్యక్తం చేశారు. ఇక కేంద్ర సాహిత్య అకాడమీ నుంచి 2025 సంవత్సరానికి 8 కవితా సంకలనాలు, 4 నవలలు, 6 కథా సంకలనాలు, 2 వ్యాస సంపుటాలు, ఒక సాహితీ విమర్శ, ఒక జీవిత చరిత్ర, 2 స్మారక రచనలకు అవార్డులు లభించాయి. ఈ అవార్డుకు ఎంపికైన ప్రముఖ రచయితల్లో బెంగాలీ రచయిత ప్రసూన్ బందోపాధ్యాయ, ఆంగ్ల రచయిత- విదేశాంగ శాఖ మాజీ అధికారి నవతేజ్ సర్నా, హిందీ రచయిత్రి మమతా కాలియా, మలయాళీ రచయిత ఎన్ ప్రభాకరన్, తమిళ రచయిత తమిళ సెల్వన్ ఉన్నారు.

## గవర్నర్ ప్రసంగం డొల్ల... చిత్తు కాగితంతో సమానం




హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో తొలిరోజు నూతన గవర్నర్ ప్రసంగం లో అబద్దాలు పలికించారని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ మిడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. గవర్నర్ ప్రసంగం మొత్తం డొల్ల అని, చిత్తు కాగితంతో సమానమని పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన గవర్నర్ తో ఈ ప్రభుత్వం పచ్చి అబద్దాలు చెప్పించింది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన స్కీంల గురించి గవర్నర్ ప్రసంగంలో లేనే లేదని,ఉన్నదల్లా కాంగ్రెస్ స్కాముల గురించే ఉందని అన్నారు. గవర్నర్ ప్రసంగంతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని, 6 గ్యారంటీలు, 420 హామీల పై గవర్నర్ ప్రసంగంలో లేదని పేర్కొన్నారు.మహిళలకు ఇస్తామని చెప్పిన రూ. 2,500 గురించి ప్రస్తావనే తేలేదని ,రెండేళ్ల నుంచి మహిళలను మోసం చేస్తూనే ఉన్నారని ఆరోపించారు.రైతులు, నిరుద్యోగులు వృద్ధులు , వితంతువులు , వికలాంగుల గురించి ప్రస్తావనే తేలేదని పేర్కొన్నారు. కేసీఆర్ ఇచ్చిన రైతు బంధు కూడా సక్కగా రావడం లేదని రైతులు నిలదీస్తు న్నారని వివరించారు. రైతులను ప్రభుత్వం మోసం చేస్తుందని దుయ్యబట్టారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి మేము ఇచ్చామని చెప్పుకుంటున్నారు. 12 వేల ఉద్యోగాలు ఇచ్చి 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని గవర్నర్ తో అబద్ధం చెప్పించారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు అయ్యేంత వరకు పోరాటం చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు చట్ట బద్దత కల్పించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం ముగిసేంత వరకు నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపామని వెల్లడించారు. అసెంబ్లీ సాక్షిగా ఆరు గ్యారెంటీలకు చట్ట బద్దత కల్పిస్తామని కాంగ్రెస్ చెప్పిందని, అసెంబ్లీ దేవాలయం లాంటిది, దేవాలయం లాంటి అసెంబ్లీలో అబద్దాలు చెప్పారని ఆరోపించారు. కొత్తగా వచ్చిన గవర్నర్ తో అబద్దాలు చెప్పించారని, అబద్దాలు చెప్పినందుకు గవర్నర్ దేవాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని విమర్శించారు. అసెంబ్లీ బ్జడెట్ సమావేశాల్లో గవర్నర్ చేత కాంగ్రెస్ ప్రభుత్వం అబద్దం చెప్పించిందని ఎమ్మెలేయ పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. ఆరు గ్యారెంటీ ల గురించి గవర్నర్ ప్రసంగంలో లేనే లేదని సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద పేర్కొన్నారు. మొదటి వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లకు పైగా అవుతుంది. ఇచ్చిన హామీలపై గవర్నర్ ప్రసంగంలో ఉంటుందేమో అనుకున్నాం. కాని ఆ ఊసే లేదని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మూడో బ్జడెట్ ప్రవేశ పెడుతుందని అన్నారు. రైతు భరోసా 15 వేలు ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదు. రైతు భరోసా ఇస్తున్నాం. రైతుల అకౌంట్లో పడుతుందో, లేదో నాకు తెలియదని రేవంత్ రెడ్డి నిర్లక్ష్యంగా మాట్లాడారని ఆరోపించారు. కళ్యాణ లక్ష్మి , తులం బంగారం ఇస్తామని చెప్పి ఎందుకు ఇవ్వడం లేదు. ఒకే ఇంట్లో ఇద్దరికి పింఛన్లు ఇస్తామని చెప్పారు. యువకులకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈ అంశాలు

## అసెంబ్లీలో తెలంగాణ తల్లి విగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంతరెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, శాసనమండలి చైర్మన గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, పలువురు మంత్రులు, అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు గవర్నర్.. శాసనసభ ప్రాంగణంలో ఉన్న మహాత్మాగాంధీ, బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభల సమావేశాలను తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ'తో ప్రారంభించి.. జాతీయ గీతం 'జనగణమన', జాతీయ గేయం 'వందేమాతరం'ను ఆలపించారు. అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరం గేయాన్ని విధిగా ఆలపించాలంటూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన జారీ చేసిన నేపథ్యంలో శాసనసభలో ఆ గేయాన్ని ఆలపించారు. ఇక తొలిరోజు సమావేశాల ముగింపు కూడా 'జయ జయహే తెలంగాణ' గీతాలాపనతోనే ముగిసింది. కాగా, బడ్జెట్ సమావేశాల తొలిరోజు శాసనసభ ప్రాంగణం కళకళాడింది. రాష్ట్ర గవర్నర్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన శివప్రతాప్ శుక్లా మొదటిసారి అసెంబ్లీలోకి అడుగు పెట్టడం, తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించడం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలంతా ఒకే ప్రాంగణానికి రావడంతో కోలాహలంగా కనిపించింది. గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించగా.. తొలిరోజు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలంతా అసెంబ్లీ సమావేశ మందిరంలో కూర్చున్నారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు 1985లో నిర్మించిన కొత్త అసెంబ్లీ భవనంలో, ఆంధ్రప్రదేశ అసెంబ్లీ సమావేశాలు పాత అసెంబ్లీ భవనం(హెరిటేజ్ భవనం, టౌనహాల్)లో జరిగేవి. అయితే 2017లో ఏపీ అసెంబ్లీ వెలగపూడికి తరలిపోవడంతో పాత భవనం ఖాళీగా ఉండిపోయింది. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక శాసన సభ, శాసనమండలి సమావేశాలను ఒకే ప్రాంగణంలో నిర్వహించాలని నిర్ణయించింది. దీంతో టౌనహాల్‌కు మరమ్మతులు చేపట్టి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. ప్రస్తుతం భవనం తళతళ మెరిసిపోతోంది. మంగళవారం నుంచి ఇదే భవనంలో శాసనమండలి సమావేశాలు జరగనున్నాయి. శాసనసభ సమావేశాలు ఎప్పటిలాగే 1985లో నిర్మించిన భవనంలోనే కొనసాగనున్నాయి. అయితే.. రెండు సభలకు కలిపి ఉమ్మడి లాబీలు ఉండడంతో ఇకపై లాబీలు కళకళలాడనున్నాయి. 119 మంది ఎమ్మెల్యేలు, 40 మంది ఎమ్మెల్సీలు, అధికారులతో అసెంబ్లీ ప్రాంగణమంతా కోలాహలంగా మారనుంది. సోమవారం కూడా ఉభయ సభల సభ్యులు తరలి రావడంతో సందడిగా కనిపించింది.

## ఇరాన్‌పై బాంబుల వర్షం

రాజధాని టెహ్రాన్‌తో పాటు ఇస్ఫహాన్ తదితర నగరాలపై ఎడతెరిపి లేకుండా క్షిపణులు, బాంబుల వర్షం కురిపించాయి. వందలాది లక్ష్యాలపై ముమ్మరంగా దాడులు చేశాయి. ఇస్ఫహాన్, నతాంజ్‌లోని అణు కేంద్రాలపైనా దాడులు జరిగాయి. ఇరాన్‌వ్యాప్తంగా డ్రోన్ తయారీ ఫ్యాక్టరీలు, సదుపాయాలనే ప్రధానంగా లక్ష్యం చేసుకున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు.క్షిపణి, డ్రోన్ తయారీ కేంద్రాలు నేలమట్టమై ఇరాన్ యుద్ధపాటవం ఇప్పటికే విపరీతంగా క్షీణించినట్టు చెప్పారు. దాడుల్లో టెహ్రాన్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ క్లినిక్ బాగా దెబ్బ తిన్నట్టు ఆ సంస్థ వెల్లడించింది. ఇరాన్ క్షిపణి లాంచర్లలో 70 శాతానికి పైగా తమ దాడుల్లో ఇప్పటికే కుప్పకూలినట్టు ఇజ్రాయెల్ సైన్యం అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ నడావ్ షోహానీ తెలిపారు. ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు 85 శాతం దాకా తుడిచిపెట్టుకుని పోయాయన్నారు.మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ భారత్‌కు ఊరటనిచ్చే వార్త అందింది. ఖతార్ నుండి లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్‌తో బయలుదేరిన భారీ ట్యాంకర్ 'శివాలిక్', సురక్షితంగా గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకుంది. హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పతాక స్థాయిలో ఉన్న సమయంలో ఈ నౌక రాక ప్రాధాన్యత సంతరించుకుంది. ఇరాన్, అమెరికా మధ్య ఘర్షణల కారణంగా ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి మూసివేత ముప్పు పొంచి ఉంది. ఇరాన్ ఈ మార్గాన్ని అడ్డుకుంటామని హెచ్చరించిన నేపథ్యంలో, గల్ఫ్ దేశాల నుండి భారత్‌కు చమురు, గ్యాస్ సరఫరా నిలిచిపోతుందేమోనన్న ఆందోళన నెలకొంది. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో 'శివాలిక్' నౌక సురక్షితంగా ప్రయాణించి లక్ష్యాన్ని చేరుకోవడం భారత ఇంధన భద్రతకు సానుకూల సంకేతంగా నిపుణులు భావిస్తున్నారు. శివాలిక్ ఎల్పిజి ట్యాంకర్ ఖతార్‌లోని రాస్ లఫ్ఫాన్ నుండి వేల టన్నుల ఎల్‌పీజీని మోసుకొచ్చింది. ఉద్రిక్తతల దృష్ట్యా భారత నావికాదళం గల్ఫ్ ప్రాంతంలో నిఘాను పెంచిన సంగతి తెలిసిందే. భారతీయ నౌకల ప్రయాణాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ భద్రతాపరమైన భరోసా కల్పిస్తోంది. గుజరాత్‌లోని అదానీ ముంద్రా పోర్టులో ఈ గ్యాస్ అన్-లోడింగ్ పక్రియ ప్రారంభమైంది. ఇది దేశీయ గ్యాస్ అవసరాలకు ఎంతో కీలకం. ప్రపంచవ్యాప్తంగా రవాణా అయ్యే చమురులో సుమారు 20 శాతం ఈ జలసంధి ద్వారానే సాగుతుంది.
ఇరాన్-అమెరికా యుద్ధం వల్ల ఈ మార్గం మూసుకుపోతే అంతర్జాతీయంగా చమురు ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలు అంతర్జాతీయ షిప్పింగ్ కంపెనీలు ఈ మార్గంలో ప్రయాణాన్ని నిలిపివేయగా, భారత్ మాత్రం తన వ్యూహాత్మక సంబంధాల ద్వారా సరఫరాను కొనసాగిస్తోంది. ఇంధన ట్యాంకర్ వద్ద చెలరేగిన మంటలు ఇరాన్ తో ఇజ్రాయెల్, అమెరికా యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్, అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్.. డ్రోన్ దాడుల ను తీవ్రతరం చేసింది. తన పొరుగుదేశాల్లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా డ్రోన్‌లతో విరుచుకుపడుతోంది. సోమవారం తెల్లవారుజామున దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో డ్రోన్ దాడులు చేసింది.

## ప్రత్యూష కేసులో కీలక మలుపు

హైదరాబాద్, మార్చి 16: తెలుగు సినీ పరిశ్రమలో రెండు దశాబ్దాల క్రితం సంచలనం సృష్టించిన సినీ నటి ప్రత్యూష మృతి కేసులో నిందితుడు గుడిపల్లి సిద్ధార్థరెడ్డి సోమవారం నాంపల్లి కోర్టులో లొంగిపోయాడు. అమెరికా నుంచి వచ్చిన ఆయన కోర్టు ముందు హాజరై సరెండర్ అయ్యాడు.

**సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత లొంగుబాటు**

ఈ కేసులో సిద్ధార్థరెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఇటీవల తిరస్కరించింది. హైకోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్షను సుప్రీంకోర్టు సమర్థిస్తూ నాలుగు వారాల్లో పోలీసుల ముందు లొంగిపోవాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆయన కోర్టులో హాజరై లొంగిపోయారు.

**2002లో సంచలనం**

2002 ఫిబ్రవరి 23న సినీ నటి ప్రత్యూష మృతి తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం రేపింది. కూల్‌డ్రింక్‌లో పురుగుమందు కలిపి తాగిన ఘటనలో ఆమె తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరుసటి రోజు మరణించింది. అదే సమయంలో విషం తీసుకున్న సిద్ధార్థరెడ్డి చికిత్స తర్వాత కోలుకున్నాడు.

**ప్రేమ వ్యవహారం నేపథ్యం**

ప్రత్యూష ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలో సిద్ధార్థరెడ్డితో ప్రేమలో పడింది. ఆమె హీరోయిన్‌గా సినీ రంగంలో రాణిస్తున్న కాలంలో సిద్ధార్థరెడ్డి ఇంజనీరింగ్ చదువుతున్నాడు. తర్వాత వారి మధ్య విభేదాలు తలెత్తినట్లు విచారణలో వెల్లడైంది.

**సీబీఐ విచారణ**

ఈ ఘటనపై సీబీఐ విచారణ జరిపి సిద్ధార్థరెడ్డిపై భారతీయ శిక్షాస్మృతిలోని 306 (ఆత్మహత్యకు ప్రేరేపణ), 309 (ఆత్మహత్యాయత్నం) సెక్షన్ల కింద కేసు నమోదు చేసింది. అనంతరం ఆయనపై ఛార్జిషీట్ దాఖలు చేసింది.

## కటక్ ఆస్పత్రిలో దారుణం

ఈ ఘటనలో 10 మంది రోగులు దుర్మరణం పాలయ్యారు. మరో 11 మందికి గాయాలయ్యాయి. ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందజేయనున్నట్లు సీఎం ప్రకటించారు. అదేవిధంగా ఈ అగ్ని ప్రమాదంపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈ తెల్లవారుజామున 2.30 నుంచి 3.00 గంటల మధ్య సమయంలో ప్రమాదం జరిగిందని ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నారు. మంటలు చెలరేగగానే తాము రోగులను ఐసీయూ నుంచి బయటికి తీసుకొచ్చే ప్రయత్నాలు చేశామని తెలిపారు. ఘటన సమయంలో ఐసీయూలో ఆ పక్కన ఉన్న వార్డులో మొత్తం 23 మంది రోగులు చికిత్స పొందుతున్నారని, వారిని తరలిస్తుండగా అప్పటికే ఏడుగురు రోగులు ప్రాణాలు కోల్పోయారని, మరో ముగ్గురు తరలించే క్రమంలో మృతిచెందారిని ఐసీయూ సిబ్బంది వెల్లడించారు. ఐసీయూ నుంచి రోగులను తరలించే క్రమంలో సిబ్బందిలో కూడా 11 మంది గాయపడ్డారని తెలిపారు.

## నీటి వివాదంపై సీఎం మౌనం ఎందుకు?

హైదరాబాద్, మార్చి 16: నీటి హక్కుల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు కలిసి తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో మాట్లాడిన హరీష్‌రావు, ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తాను ఈ అంశాన్ని ప్రస్తావించిన తర్వాతే ప్రభుత్వం లేఖలు విడుదల చేస్తోందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నీటి హక్కుల కోసం మాజీ సీఎం కేసీఆర్ నిరంతరం పోరాడారని హరీష్‌రావు గుర్తుచేశారు. కృష్ణా నదీ జలాల పునర్విభజనను సాధించడంలో కేసీఆర్ కీలక పాత్ర పోషించారని చెప్పారు. గోదావరి నదిలో తెలంగాణకు 968 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 531 టీఎంసీలు కేటాయించబడినట్లు పేర్కొన్నారు.

గోదావరి జలాలపై వివాదం

గోదావరి జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ కన్ను పడిందని హరీష్‌రావు ఆరోపించారు. ఈ ఏడాది జనవరి 30న ఢిల్లీలో రెండు రాష్ట్రాల ఇరిగేషన్ అధికారులతో సమావేశం జరిగినట్లు తెలిపారు. ఆ సమావేశానికి వెళ్లిన తెలంగాణ అధికారులు సరైన విధంగా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేదని హరీష్‌రావు విమర్శించారు. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) గోదావరి జలాలకు స్పష్టమైన కేటాయింపులు లేవని పేర్కొన్నట్లు తెలిపారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు బలంగా స్పందించడం లేదని హరీష్‌రావు ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు గీత కార్మికుల నిరాహార దీక్షలు

## ప్రారంభించిన సిపిఎం రాష్ట్ర నాయకులు మల్లేష్




**మిర్యాలగూడ మార్చి 16:-( ప్రభాత సూర్య):** కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలంటూ స్థానిక సబ్ కలెక్టరేట్ ముందు సోమవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలను సిపిఎం రాష్ట్ర నాయకులు డబ్బికార్ మల్లేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్ళు గీత కార్మిక లు గత కొన్ని సంవత్సరాలుగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకొని వారికి ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చలేదని అన్నారు. రాష్ట్ర బడ్జెట్లో కల్లుగీత కార్పొరేషన్కు 5000 కోట్లు కేటాయించి వాటిని ఖర్చు చేయాలని కోరారు. నిధులు మంజూరు చేయడంతో పాటు వాటిని ఖర్చు చేయకుండా నిల్వ ఉంచటం సరైన కాదని విమర్శించారు. గీత కార్మికులకు పెండింగ్లో ఎక్స్రేషియా ఉందని దాన్ని వెంటనే విడుదల చేయాలని, 50 సంవత్సరాలు నిండిన గీత కార్మికులకు పెన్షన్ చేయాలని ఆయన కోరారు. కల్లులోని పోషకాలను వచ్చేత గుణాలను ప్రభుత్వమే ప్రచారం చేసి మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చిందని 4వేల కు పెన్షన్ ఎక్స్రేషియా 10 లక్షలకు పెంచాలని వారు డిమాండ్ చేశారు. మీరా తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలను నెలకొల్పి, మూసివేసిన మీరా కేవలం తెరిపించాలని కోరారు. గీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు చౌగాని సీతారాములు మాట్లాడుతూ కల్లుగీత సొసైటీలను బలోపేతం చేయాలని ఎన్నికలను రెగ్యులర్గా నిర్వహించాలని కల్లుగీత కార్మికులకు ద్విచక్ర వాహనాలు ఇవ్వాలని ఏజెన్సీ ఏరియాలలో సొసైటీలను పునరుద్ధరించాలని వారు కోరారు. కల్లుగీత పని చేసే వారికి కాటమయ్య రక్షణ కవచం కల్పించాలన్నారు. హైదరాబాద్ నగరంలో ట్యాంక్ బండ్ వద్ద బాపన్న విగ్రహాన్ని నెలకొల్పాలని జనగామ జిల్లాకు పాపన్న పేరు పెట్టాలని కోరారు. ఉదయం నుండి సాయంత్రం వరకు సాగిన నిరాహార దీక్షను సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు మంగారెడ్డి మిర్యాలగూడ ఒన్ టౌన్ కార్యదర్శి గౌతమ్ రెడ్డి కార్యకర్తలకు నిమ్మరసం అందించి దీక్షలు విరమింప చేశారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘం నాయకులు బోడ వెంకన్న చెనగాని లక్ష్మయ్య పాపయ్య శ్రీనివాస్ దుర్గయ్య దుర్గయ్య సైదులు నరహరి లింగయ్య లక్ష్మయ్యలు పాల్గొన్నారు.

# ఆసుపత్రిలో సౌకర్యాలపై సిపిఎం బృందం ఆరా





### ఆరోగ్యశ్రీ వర్తింపజేయాలని డిమాండ్

**మిర్యాలగూడ మార్చి 16:-( ప్రభాత సూర్య):** స్థానిక 200 పడకల ఏరియా ఆసుపత్రిని సోమవారం నాడు సిపిఎం బృందం సందర్శించి రోగులకు అందిస్తున్న సౌకర్యాలపై సిపిఎం బృందం ఆరా తీసింది. ఆసుపత్రిలో పళ్ళు వార్డులలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వారికి అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ ను కలిసి రోగులకు అందిస్తున్న విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణ చుట్టుపక్కల ప్రాంతాలకు తగినట్టుగా ఆసుపత్రిలో సౌకర్యాలు అరకొరగా అందుతున్నాయన్నారు. సోమవారం నుండి జరిగే రాష్ట్ర బడ్జెట్లో వైద్యానికి అధిక నిధులను కేటాయించి స్థానిక ఆసుపత్రిలోని సౌకర్యాలను మెరుగుపరచాలని కోరారు. ఆసుపత్రిని ట్రామా సెంటర్ గ మారడం హర్షనీయమే కానీ దానికి కార్యాచరణలో అమలు కావాలన్నారు. గత సంవత్సర కాలం నుండి రాష్ట్ర ప్రభుత్వం ఆస్పత్రిలో వచ్చే రోగులకు ఆరోగ్యశ్రీని అందించకపోవడం అన్నారు. ఏరియా ఆసుపత్రికి వచ్చే ప్రజలు పేద వర్గాలకు చెందిన వారిని, వారు ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోలేని స్థితిలో ఉన్నారని అలాంటి వారికి ప్రభుత్వం వైద్య సహాయం అందించాలని కోరారు. ఆసుపత్రిలో గత కొంతకాలంగా దంత వైద్యులు లేరని మంజూరైన స్పెషలిస్ట్ డాక్టర్లను వెంటనే పంపించాలని కోరారు. ఆసుపత్రిలో స్కానింగ్, సిటీ స్కానింగ్ గాని లేవని న్యూరో సర్జన్ పోస్టు మంజూరైన ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ విధానం పనిచేస్తున్న వారందరిని రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆయనతో పాటు సిపిఎం జిల్లా కార్యదర్శివర్ సభ్యులు వి. వెంకటేశ్వర్లు, ఆర్. మంగారెడ్డి, డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, జగదీష్చంద్ర ఉన్నారు.




## సీ. ఓ.డీ.జంక్షన్ లో 'అరైవ్ అండ్ అలైవ్' అవగాహన కార్యక్రమం....

**మాదాపూర్ ప్రభాత సూర్య :** మాధాపూర్ లోని సీ. ఓ.డీ జంక్షన్ వద్ద రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు 'అరైవ్ అండ్ అలైవ్' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ ఆర్. ఐ. శ్రీకాంత్, ఎస్. ఐ. రాములు,ఆర్.ఎస్.ఐ రాఘవేంద్ర మరియు సిబ్బంది హాజరయ్యారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు తప్పకుండా పాటించాలని, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగం ప్రాణాలను కాపాడుతుందని అధికారులు వివరించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలని, వేగ నియంత్రణ పాటించాలని అధికారులు సూచించారు. కార్యక్రమానికి స్థానికులు, వాహనదారులు స్పందించి అవగాహన కార్యక్రమాన్ని అభినందించారు.

# ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి అడ్డంకులు: కలెక్టర్‌కు మహిళ ఫిర్యాదు





తేది:16:03:2026.
మర్రిగూడ.
శ్రీయుత గౌరవనీయులైన నల్గొండ కలెక్టర్ గారికి నమస్కరించి వ్రాయునది ఏమనగా
విషయం:
ఇందిరమ్మ ఇల్లు కట్టుకొనివ్వకుండా మా పక్కింటి వాళ్ళు అడ్డుపడుతున్నారు.
[illegible]
E. Renuka

**మర్రిగూడ, మార్చి 16: ప్రభాత వార్త :** మర్రిగూడ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి పొరుగువారు అడ్డంకులు సృష్టిస్తున్నారని బాధిత మహిళ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఈద రేణుక తెలిపిన వివరాల ప్రకారం, తాను ఈద కాశయ్య భార్యగా మర్రిగూడ గ్రామానికి చెందినదానని, ప్రేమ వివాహం చేసుకున్న తమకు ఇల్లు లేకపోవడంతో ప్రభుత్వ గృహలక్ష్మి పథకం కింద ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిందని తెలిపింది. ఇంటి నిర్మాణం ప్రారంభించినప్పటి నుంచి పక్కింటి వారు ఈద వెంకటమ్మ, ఈద రాణి తదితరులు మేస్త్రీలు, కార్మికులను దుర్భాషలాడుతూ నిర్మాణ పనులు ఆపాలని బెదిరిస్తున్నారని ఆమె ఆరోపించింది. తాము ఇల్లు ఎలా కడతారో చూస్తామని హెచ్చరిస్తూ, తమపై దాడి చేయడానికి కూడా ప్రయత్నించారని పేర్కొంది. ఈ వివాదం కారణంగా తమ కుటుంబం తీవ్ర ఇబ్బందులు పడుతోందని, భర్తకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆసుపత్రి ఖర్చులు కూడా ఎక్కువయ్యాయని వాపోయింది. అప్పులు తెచ్చుకుని ఇల్లు కట్టుకుంటున్న సమయంలో ఇలా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆమె తెలిపింది. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకునేలా తగిన న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను బాధితురాలు కోరింది.

## బీర్ల ఫౌండేషన్ సౌజన్యంతో ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా....



ఆలేరు మార్చి 16 ప్రభాత సూర్య: ఆలేరు మండలంలోని మంతపురి గ్రామంలో స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయం ఆవరణలో బీర్ల ఫౌండేషన్ వారి సౌజన్యం తో సోమవారం రోజున ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా కానుకలను గ్రామ సర్పంచ్ పసుల సతీష్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ దంతూరి స్వామి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నోములు. చంద్రశేఖర్,వార్డు సభ్యులు పేరపు క్రృష్ణ, పేరపు స్వామి, గుమ్మడి సోములు తదితరులు పాల్గొన్నారు.



## సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన సర్పంచ్ రమాదేవి

**మునుగోడు మార్చి 16 (ప్రభాత సూర్య):** మునుగోడు పట్టణ కేంద్రంలో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంజూరు చేయించిన ఉపాధి హామీ నిధులు 35 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులను సర్పంచ్ పాలకూరీ రమాదేవి నరసింహ గౌడ్ శంకుస్థాపన చేశారు..ప్రజల సహకారంతో గ్రామాన్ని అబివృద్ధి చేస్తామన్నారు. సెక్రెటరీ రాజశేఖర్ రెడ్డి,వార్డు సభ్యులు నారగోని అనూష జగన్,నాయకులు ఎండి అన్వర్,రాజు గ్రామస్థులు పాల్గొన్నారు.

## వనపర్తి డిసిసి డాక్టర్స్ సెల్ చైర్మన్ గా పి జే బాబు



**వనపర్తి ప్రభాత సూర్య ప్రతినిధి:** వనపర్తి జిల్లా మెడికల్ ఉహెల్త్ వింగ్ విభాగానికి డాక్టర్స్ సెల్ చైర్మన్ గా కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన చిన్నపిల్లల డాక్టర్ పి.జె బాబు ను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం అసెంబ్లీ ఆవరణ లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా డాక్టర్ పి.జె బాబు నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..తనపై నమ్మకంతో అవకాశం ఇచ్చిన టీపీసీసీ అధ్యక్షులకు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల్ల చిన్నారెడ్డికి దేవరకద్ర ఎమ్మెల్యే జిమధుసూదన్ రెడ్డికి,వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి.నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజెష్ రెడ్డికి, వనపర్తి డిసిసిఅధ్యక్షులు శివసేన రెడ్డి. డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు రాజీవ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వారి ఉత్సవాలు





**అమీన్ పూర్ , మార్చి 16,ప్రభాత సూర్య :** అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని జానకంపేట్ గ్రామంలో నిర్వహించిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి ఉత్సవాల్లో పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ వి. ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు మరియు ఆలయ కమిటీ సభ్యులు ఆదర్శ్ రెడ్డి కి ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జానకంపేట్ మాజీ సర్పంచ్ పండు యాదవ్, కిష్టారెడ్డిపేట్ మాజీ సర్పంచ్ కృష్ణ, వడిగేపల్లి మాజీ సర్పంచ్ మల్లేష్, బీఆర్ఎస్ యువ నాయకులు మాణిక్ యాదవ్,సాయి కృష్ణ, శివ మరియు ఇతర స్థానిక నాయకులు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు



**మర్రిగూడ: మార్చి 16 ప్రభాత వార్త :** పాలమూరు ముద్దుబిడ్డ, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి, ప్రజల కోసం ఎల్లప్పుడూ పోరాడే ఉద్యమ నేత, మాజీ మంత్రివర్యులు శ్రీనివాస్ గౌడ్‌కు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మర్రిగూడ మాజీ ఎంపీపీ అనంత రాజు గౌడ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అనంత రాజు గౌడ్ మాట్లాడుతూ శ్రీనివాస్ గౌడ్ నాయకత్వం ఎల్లప్పుడూ ప్రజలకు దారి చూపుతుందని, ఆయన సేవాభావం రాష్ట్ర ప్రజలకు ఆదర్శమని అన్నారు. ప్రజా సేవలో ఆయన మరెన్నో సంవత్సరాలు ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరుకున్నారు.

## పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ పరిశీలన

వ్యాపారుల సమస్యలు వినిపించుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం: త్వరిత పరిష్కారానికి హామీ.



**పటాన్చెరు, మార్చి 16,ప్రభాత సూర్య :** మండలం లోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్‌లోని దుకాణదారులు తమ సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు.మార్కెట్ యార్డ్‌లో కూరగాయల దుకాణాల్లో ఉల్లిగడ్డ, ఆలుగడ్డ విక్రయాలు జరుగుతున్న కారణంగా ప్రత్యేకంగా ఉల్లిగడ్డ, ఆలుగడ్డ వ్యాపారం చేసే వ్యాపారులకు నష్టం కలుగుతోందని వారు వివరించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మార్కెట్ యార్డ్‌లో త్రాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వ్యాపారులు తెలియజేశారు. ఈ అంశాలను శ్రద్ధగా విన్న చైర్మన్ శివానందం సమస్యలపై సానుకూలంగా స్పందించారు. మార్కెట్ యార్డ్ పరిస్థితులను స్వయంగా పరిశీలించిన అనంతరం వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చైర్మన్ శివానందం తెలిపారు.

## విద్యార్థులు ఉపాధ్యాయులు మారినవేళ

చెరువుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవ వేడుకలు





**మాడుగులపల్లి (మార్చి 16 )ప్రభాత సూర్య ప్రతినిధి :** మాడుగులపల్లి మండలం చెరువుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో సోమవారం స్వపరిపాలన దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగిం ది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవి మాట్లాడుతూ మా పాఠశాలలో అన్ని సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో వైభవంగా జరుపుకుంటాం అని, విద్యార్థులకు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు , క్రీడలు వంటివి నేర్పుతున్నామని అన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు అయినవేళ ఎమ్మెల్యే కలెక్టర్ డాక్టర్ గా విద్యార్థులు వారి విధులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి యాదయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు ....




**ఆలేరు మార్చి 16 ప్రభాత సూర్య.:** ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామంలో జిల్లా ఉన్నత పాఠశాలలో సోమవారం రోజున అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ అబ్దుల్ హమీద్ అగ్ని ప్రమాదాలు ఎలా జరుగుతాయి, వాటిని ఎలా నివారించాలి, ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఫైర్ అధికారులతో ప్రదర్శన ద్వారా వివరించారు. అగ్నిమాపక సిబ్బంది అగ్నిప్రమాదం సంభవించినప్పుడు భయపడకుండా సమయోచితంగా స్పందించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆకుల వేణుగోపాల్, అగ్నిమాపక సిబ్బంది హరీష్ రెడ్డి, కరుణాకర్, మల్లికార్జున్, శ్రీనివాస్ ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్ పై యుద్ధం ఆపాలి సిపిఐ

### నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఐ శ్రేణులు



**సంస్థాన్ నారాయణపురం, మార్చి 16(ప్రభాత సూర్య):** ఇరాన్ దేశంపై అమెరికా ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని, యుద్ధం వల్ల సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతుందని సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చన గోని గాలయ్య అన్నారు సోమవారం నారాయణపురం మండల కేంద్రంలో సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధం వల్ల ఇరాన్ లోని చమురు ,గ్యాస్ ఇతర ఆయిల్ నిక్షేపాలు ఇతర దేశాలకు ఉత్పత్తి నిలిచిపోవడం మూలంగా మనదేశంలో వంటగ్యాస్ ధర పెరుగుతుందని, రాబోయే రోజుల్లో పెట్రోల్ డీజిల్ ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పినట్లు మన దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పని చేస్తున్నదని ఆయన విమర్శించారు భారతదేశ అలిన విదేశాంగ విధానాన్ని తుంగలో తొక్కి భారతదేశ సార్వభౌమాధికారాన్ని అమెరికా అధ్యక్షుని పాదాల వద్ద కేంద్ర ప్రభుత్వం పెడుతున్నదని ఎద్దేవ చేశారు. ఒకపక్క గ్యాస్ కొరత లేదంటూనే మరొకపక్క కృతిమ కొరత సృష్టించి సామాన్య ప్రజానీకానికి గ్యాస్ అందుబాటులో లేకుండా పోయినదని బుకింగ్ చేసుకొని వారం రోజులు గడిచినా గాని రావడంలేదని అదేవిధంగా హాస్టల్లో రెసిడెన్షియల్ స్కూల్ లలో కట్టెల పొయ్యి మీదనే స్కూల్ పిల్లలకు వంట కొనసాగిస్తున్నారని తక్షణమే వారికి గ్యాస్ సరఫరా చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. అదేవిధంగా నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించి సామాన్య ప్రజలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, జిల్లా సమితి సభ్యులు చిలువేరు అంజయ్య , కలకొండ సంజీవ రైతు సంఘం నాయకులు తోకల రాంరెడ్డి,పల్లె మల్లారెడ్డి, నల్లవెల్లి ముత్యాలు,సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు పొట్ట శంకరయ్య, సుర్వి నరసింహ, మహ్మదాబాద్ సర్పంచ్ ముత్యాల అంజయ్య, భీమనపల్లి గాలయ్య, ఈద మల్లయ్య, బైకని రాజు, దుబ్బాక కిషన్, పందుల యాదగిరి, ఎర్రోళ్ల లింగయ్య, పల్లె గోపాల్ రెడ్డి, గడ్డం యాదగిరి, కే.నాను తదితరులు పాల్గొన్నారు

# లీప్ స్పేస్‌పై గీతంలో శిక్షణ

### ప్రధాన వక్తగా పాల్గొన్న ఎల్సెవియర్ కస్టమర్ సక్సెస్ మేనేజర్ శివాలికా వర్మ

**ప్రభాత సూర్య:** మండలం లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని విజ్ఞాన వనరుల కేంద్రం (కే.ఆర్.సీ. లేదా గ్రంథాలయం) ఆధ్వర్యంలో సైన్స్ డైరెక్ట్ ఏఐ సాధనం, లీప్ స్పేస్ పై ఒకరోజు ఆన్ లైన్ శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పరిశోధకుల పండిత సాహిత్యాన్ని మరింత సమర్థవంతంగా కనుగొని, విశ్లేషించే సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేశారు. ఎల్సెవియర్ కస్టమర్ సక్సెస్ మేనేజర్ శివాలికా వర్మ ఈ కార్యక్రమంలో ప్రధాన శిక్షకురాలిగా వ్యవహరించారు. అధునాతన సాహిత్య ఆవిష్కరణ, పరిశోధన అంతర్దృష్టులు, విద్యా సహకారం కోసం సైన్స్ డైరెక్టర్ ఏఐ ఆధారిత ప్లాట్ ఫామ్ లీప్ స్పేస్ ను ఉపయోగించడంపై ఆమె ఆచరణాత్మక మార్గదర్శకత్వాన్ని అందించారు.ఇందులో భాగంగా, లోతైన పరిశోధన అంతర్దృష్టులను రూపొందించడానికి స్కోపస్ డేటా, సైన్స్ డైరెక్టర్ పూర్తి-టెక్స్ట్ వనరులను ఈ సాధనం ఎలా ప్రభావితం చేస్తుందో ఆమె వివరించారు. అంశాలను



అన్వేషించడం, నిపుణులను కనుగొనడం, నిధుల లభ్యత వంటి కీలక అంశాలు ఈ శిక్షణలో ఉన్నాయి. ఇవి పరిశోధకులు వర్ధమాన పరిశోధనా రంగాలను అన్వేషించడానికి, అలాగే సహకార, నిధుల అవకాశాలను గుర్తించడానికి వీలు కల్పిస్తాయి.అంశాల అన్వేషణలో భాగంగా, సాలిడ్-స్టేట్ బ్యాటరీ టెక్నాలజీలో పరిణామాలు, మానవ ఆరోగ్యంపై మైక్రోప్లాస్టిక్ ల ప్రభావం చుట్టూ తలెత్తుతున్న ప్రశ్నలు, సీఆర్ఐఎస్పీఆర్ జన్యు సవరణలో ఇటీవలి పురోగతులు, చర్చలు వంటి ప్రస్తుత పరిశోధనాంశాలను ఆమె వివరించారు.జనరేటివ్ ఏఐ భద్రత, పీఎఫ్ఏఎస్ కాలుష్యం, నివారణ, అలాగే భారీ భాషా నమూనాల (ఎల్ఎల్ఎం) మూల్యాంకన పరిశోధన వంటి రంగాలలో అగ్రశ్రేణి రచయితలు, పరిశోధకులను గుర్తించడంపై శివాలికా మార్గనిర్దేశం చేశారు.వ్యవసాయంలో ప్రారంభ దశ పీఎఫ్ఏఎస్ పరిశోధనకు మద్దతు ఇచ్చే సంభావ్య గ్రాంట్లను, మైక్రోప్లాస్టిక్స్, మానవ ఆరోగ్యంపై అధ్యయనాలు, ఓపెన్ సైన్స్, పరిశోధన మౌలిక సదుపాయాలను ప్రోత్సహించే చొరవలను గుర్తించడంలో పరిశోధకులకు సహాయపడే 'ఫైండ్ ఫండింగ్ ఫీచర్'ను కూడా ఆమె వివరించారు. తొలుత, గీతం చేపడుతున్న పరిశోధనా ప్రాజెక్టులకు ఎల్స్ వియర్ ఎలా మద్దతు ఇస్తోందీ ఆ సంస్థకు చెందిన ప్రణవ్ శుక్లా వివరించారు. గీతంలోని వివిధ విభాగాల అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. కే.ఆర్.సీ. డైరెక్టర్ ఎస్.పి.ఏ. బాలసుబ్రమణియన్, ఉప గ్రంథపాలకుడు కె. రామకృష్ణల పర్యవేక్షణలో ఈ ఆచరణాత్మక ఆన్ లైన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా, సహాయ గ్రంథపాలకుడు కె. దుర్గాప్రసాద్ సమన్వయం చేశారు.



## ఎమ్మెల్యే జిఎంఆర్ మాతృమూర్తిని పరామర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు..



పటాన్చెరు, మార్చి 16,ప్రభాత సూర్య : మండలం లోని గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో హైదరాబాద్ లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మాతృమూర్తి శ్రీమతి గూడెం మాణెమ్మ ని సోమవారం ఉదయం రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట శాసన సభ్యులు శ్రీ తన్నీరు హరీష్ రావు పరామర్శించారు. చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. భగవంతుడి ఆశీస్సులతో త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. హరీష్ రావుతో పాటు దుబ్బాక ఎమ్మెల్యే శ్రీ కొత్త ప్రభాకర్ రెడ్డి , నర్సాపూర్ ఎమ్మెల్యే శ్రీమతి సునీత లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఎమ్మెల్యే జిఎంఆర్ తో పాటు వారి కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని సూచించారు.




## సబ్ కలెక్టర్ కార్యాలయంలో రంజాన్ మాస ముస్లిం ఉద్యోగులకు ఇఫ్తార్ విందు

**మిర్యాలగూడ ,మార్చి 6:- (ప్రభాత సూర్య ):** మిర్యాలగూడ సబ్ కలెక్టరేట్ లో సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ముస్లిం అధికారులు, ఉద్యోగులకు ఇఫ్తార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆధ్వర్యంలో రంజాన్ తోహఫా పంపిణి మండలాల వారీగా పంపిణి చేస్తున్నామని, నియోజకవర్గ వర్గానికి 1,000 జతల దుస్తులు వచ్చాయన్నారు.శాంతి, ప్రేమ, సౌభాతృత్వంతో ప్రాంత దేశ ప్రగతి ముడి పడి ఉందన్నారు. ఇఫ్తార్ సమర్థవంతంగా నిర్వహించినందుకు అభినందించారు. తొలి సారి సబ్ కలెక్టరేట్ లో ఇఫ్తార్ నిర్వహించడం ఇందుకు సబ్ కలెక్టర్ అభినందనీయులని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో ముఫ్తి మొహమ్మద్ ఇమ్రాన్, మిర్యాలగూడ, మాడ్గులపల్లి తహసీల్దార్లు పి. శ్రీనివాస్, సరోజ పావని, డిప్యూటీ తహసీల్దార్లు చాంద్ పాషా, ప్రవీణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఎండి. అబ్బాస్, సబ్ కలెక్టర్ సీసీ ఎండి. అఫ్రోజ్, జూనియర్ అసిస్టెంట్ ఎండి.జమాల్, ఆర్ఐ టీ. రామకృష్ణ, టీఎన్జిఒ అధ్యక్షుడు జానీపాషా, పాత్రికేయులు ఖాజా హామీదుద్దీన్, ఎండి.అస్లాంలు పాల్గొన్నారు.






## ఆలేరుమండలంలో స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల కోసం క్రీడా పోటీలు...

**ఆలేరు మార్చి 16 ప్రభాత సూర్య:** ఆలేరు మండలం: నాలుగవ తరగతి స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల కోసం మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు ఈ నెల 17వ తేదీ ఉదయం 8 గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆలేరు ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి ఎర్ర లక్ష్మితెలిపారు. ఈ పోటీలకు 01-09-2017 నుండి 31-08-2018 మధ్య జన్మించిన మూడో తరగతి (2025.2026)లో పూర్తి కాబోతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో బాలికలకు 80 సీట్లు, బాలురకు 80 సీట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించే ఈ ఎంపికలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి ఎంపికలకు పంపిస్తామని చెప్పారు. ఈ సెలెక్షన్ ప్రక్రియలో భాగంగా 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల పరుగుపందెం, 6ఐ10 మీటర్ల షటిల్ రన్, మెడిసిన్ బాల్ పుట్, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, హైట్, వెయిట్ వంటి బ్యాటరీ టెస్టుల ఆధారంగా ఎంపికలు నిర్వహిస్తారు. పోటీలలో పాల్గొనదలచిన విద్యార్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆలేరు ఫిజికల్ డైరెక్టర్ గడసంతల మధుసుధను (మొబైల్: 9000989671) ను సంప్రదించాలని కోరారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందించాలి





**చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రి కలెక్టర్ ఆకస్మిక తనిఖి**

**ఓపి రిజిస్టర్ పరిశీలించిన చేసిన కలెక్టర్**

**కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిశీలన...**

**యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**చౌటుప్పల్,మార్చి 16, ప్రభాత సూర్య :** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.సోమవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కలెక్టర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా ఆయన పరిశీలించారు.ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది ఎంత మంది విధులు నిర్వహిస్తున్నారని సంబంధిత అధికారులు అడిగి తెలుసుకున్నారు.ప్రతి రోజు ఉదయం ఎంత మంది విధులు నిర్వహిస్తున్నారని, రాత్రి వేళలో కూడా ఎంతమంది సిబ్బంది విధులు



నిర్వహిస్తుంటారని ఆరా తీశారు.ఎమర్జెన్సీ కేసులు వచ్చినపుడు ఇక్కడే వైద్యం అందిస్తారా, లేక బయటకు పంపిస్తారా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రతి రోజు ఓపి కి ఎంతమంది వస్తున్నారని ఓ.పి రిజిస్టర్ ను పరిశీలించారు. గత నెలలో ఈ ఆసుపత్రిలో ఎన్ని సాధారణ ప్రసావాలు జరిగాయని తెలుసుకున్నారు. కలెక్టర్ ఆసుపత్రి లోని వార్డులను తిరుగుతూ, పేషెంట్ల వద్ద కు వెళ్లి వారి ఆరోగ్యం పరిస్థితులను గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది సమయానికి అందుబాటులో ఉండి చికిత్సలు అందిస్తున్నారా అని పేషంట్ ను అడిగి తెలుసుకున్నారు.ఫార్మసి రూమ్ లో మందుల స్టాక్ రిజిస్టర్ ను, మందులను పరిశీలించారు. అవసరమైన ఔషధాలు అన్ని అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. గడువు ముగిసిన మందులను చెక్ చేయాలన్నారు. పేషెంట్లకు ఇచ్చే మందులను ఒకటికి రెండుసార్లు చెక్ చేసి ఇవ్వాలన్నారు.ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న బాలింతలతో కలెక్టర్ మాట్లాడారు. డెలివరీ సమయంలో డాక్టర్లు ఎలా చూసుకు న్నారని,పుట్టిన బిడ్డ కి వ్యాక్సిన్ వేశారా అని అడిగారు. వాక్సిన్ ను అందుబాటులో ఉంచాలన్నారు.రోజు మంచి భోజనం పెడుతున్నారా, భోజనం రుచి కరంగా వుంటుందా అని పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, మునుగోడు ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, డాక్టర్ అలివేలు, వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నల్గొండలో ఆర్ కె ఫ్రెష్ సూపర్ మార్కెట్ ప్రారంభం

**నల్గొండ ప్రభాత సూర్య :** నల్గొండ పట్టణ కేంద్రంలో మిర్యాలగూడ రోడ్ శ్రీనివాస కాలనీ బి టి ఎస్ సోమవారం నల్గొండ మున్సిపాలిటీ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ, 22 వ డివిజన్ కార్పొరేటర్ సయ్యద్ సమ్మద్, 21వ డివిజన్ కార్పొరేటర్ ఇబ్రహీం, ఐదవ డివిజన్ కార్పొరేటర్ పున్న గణేష్ జ్ఞానేశ్వరి, ఆర్కే సూపర్ మార్కెట్ నిర్వాకులు షేక్ అబ్దుల్ కరీం సాబ్ ఆర్కే సూపర్ మార్కెట్ ను ప్రారంభించి మాట్లాడారు. మిర్యాలగూడ రోడ్డులో గల నూతనంగా ఆర్కే సూపర్ మార్కెట్ ను ఏర్పాటు చేసినందుకు ఎస్కే అబ్దుల్ కరీం సాబ్ ను అభినందించారు. పట్టణ ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన తాజా హోమ్ నీడ్స్, అన్ని రకాల వంట నూనెలు, కూరగాయలు, రైస్, వాటర్ బాటిల్స్, వివిధ రకాల చిప్స్, చిరుధాన్యాలు, కిచెన్ సంబంధించిన అన్ని రకాల వస్తువులు లభించిన అని తెలిపారు. అవకాశాన్ని పట్టణ, గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ సలీం, ఆశ బేగం, షేక్ హుస్సేన్ సాబ్, ఇమామ్ బి, యాస్మిన్ సుల్తానా, అబ్దుల్ షరీఫ్, లతీఫ్ పాషా, సైదాబీ, షబేర బేగం తదితరులు పాల్గొన్నారు.



# 6 గ్యారంటీలు అమలు చేయకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పతనం ఖాయం

**ఆలేరు, మార్చి 16,ప్రభాత సూర్య :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ పతనం ఖాయమని బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు బుల్లెట్ మాధురి మండల పట్టణ అధ్యక్షులు పూజారి కుమారస్వామి గౌడ్ నందగంగేష్ లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి పార్టీ ఆలేరు మండల పట్టణ కమిటీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఆలేరు తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణ సాధ్యం కానీ హామీలతో అధికారంలోకి వచ్చి ఇప్పటివరకు ఏ ఒక్క హామీ అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు రైతు రుణమాఫీ పూర్తిగా చేయలేదని రైతు భరోసా ఇవ్వడం లేదని నాణ్యమైన విద్యుత్ని అందించకపోవడంతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. యువతకు నిరుద్యోగ భృతి ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ యువత రోడ్డున పడుతున్నారని తెలిపారు. మహిళలకు 2500 రూపాయలు అదేవిధంగా స్కూటీ తులం బంగారం అందిస్తామని ఇప్పటివరకు ఇవ్వలేదు. ఇప్పటివరకు ప్రజలకు ఏ ఒక్క సంక్షేమ పథకాలు



అందరం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ ఇల్లు కేంద్ర ప్రభుత్వం ఆవాస్ యోజన కింద దాదాపు 3 లక్షల రూపాయలు అందిస్తున్నారని మిగిలిన పైసలు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఇళ్ల లబ్ధిదారులకు రాకపోవడం ఇండ్లు మధ్యలోనే ఆగిపోయి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. హైడ్రా, మూసినది సుందరీ కరణ, నిషేధిత ఇండ్ల జాబితా అంటూ పేద ప్రజల ఇండ్లను కుల కొట్టడమే పనిగా పెట్టుకుని కాంగ్రెస్ నాయకులు రాక్షస ఆనందం పొందుతున్నారు. రానున్న రోజుల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు చేయకపోతే బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యపరిచి ఉద్యమాలు చేసి కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులను అడ్డుకొని గ్రామాల్లో తి ం ు గ ు నీ య ం ు వ ం ని హెచ్చరించారు. అనంతరం ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిప్యూటీ తహసిల్దార్ ఉపేందర్ కు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కమిట్కరి కృష్ణ జిల్లా కౌన్సిల్ మెంబర్లు భోగ శ్రీనివాస్ వద్దెమాన్ నరేందర్ కౌన్సిలర్ పాసికంటి సంపత్ మండల పట్టణ ప్రధాన కార్యదర్శిలు అమరేందర్ సుంకరి సృజన్ ఏలుగల వెంకటేష్, జిల్లా నాయకులు మాల్ రెడ్డి నరసింహారెడ్డి ఎలగందుల సురేష్ మాధవి చిలు గురి నర్సిరెడ్డి పూల హనుమంతు కంటి శంకర్ వద్దేపల్లి కిషన్ కళ్లెపు రాజు శాంతి రెడ్డి తెరల రాజేశ్వర్ పెరపు ఆనంద్ కుందే గణేష్ గుర్రపు నరసింహులు బందుల విష్ణు ఐలి సందీప్ పరమని స్వామి కాంద్రజు శ్రీనివాస్, గిరిబోయిన పరిషరాములు, ఎలాగందుల రమేష్ తదితరులున్నారు.



## మార్చి 31 లోపు ఇంటి పన్ను బకాయిలు వసూలు చేయాలి: అదనపు కలెక్టరు భాస్కర్ రావు...

**ఆలేరు మార్చి 16 ప్రభాత సూర్య:** మార్చి 31 లోపు ఇంటి పన్ను బకాయిలను వసూలను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధికారులను ఆదేశించారు. ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, సిబ్బంది హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలకు సమయానికి సేవలు అందించే విధంగా పనిచేయాలని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయితీల అభివృద్ధికి ఇంటి పన్ను ఎంతో ముఖ్యమని అన్నారు. మార్చి 31 లోపు 100% ఇంటి పన్ను వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. గడువులోపు ఇంటి పన్ను పూర్తి చేయకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులు సమర్థవంతంగా కొనసాగాలంటే ఆదాయ వనరులు పెరగటం అవసరమని తెలిపారు. గ్రామాల్లో మొక్కల పెంపకం సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎక్కువ సంఖ్యలో మొక్కలు పెంచే కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. అనంతరం స్థానిక పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. అలాగే భోజనం రుచికరంగా, పరిశుభ్రంగా ఉందా లేదని తానే స్వయంగా పరిశీలించారు. పిల్లలకు పోషకాహారంతో కూడిన భోజనం అందే విధంగా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ కిషన్, గ్రామ పంచాయతీ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్ జూకంటి అనిల్ ...





**ఆలేరు మార్చి 16 ప్రభాత సూర్య:** ఆలేరు మండలంలోని టంగుటూరు గ్రామంలో మాక్స్ విజన్ హాస్పిటల్ హన్మకొండ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ జూకంటి అనిల్ కుమార్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఈ యొక్క వైద్య శిబిరం ద్వారా వైద్య పరీక్షలు చేయించుకోవాలని అదేవిదంగా ఏదైనా కంటి సమస్యలు ఉంటే హాస్పిటల్ వారు ఉచితంగా ఆపరేషన్ చేసే సౌకర్యం కూడా ఉందని తెలిపారు. గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ శిరీషాని మరియు ఈ క్యాంప్ ఏర్పాటు చేయించిన కళ్లేపు లావణ్య ను సర్పంచ్ శాలువాతో సన్మానించారు. ఈ వైద్య శిబిరంలో వార్డ్ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనం గా జన్మదిన వేడుకలు జరుపుకున్న సముద్రాల రవి

**ఆలేరు, మార్చి 16,ప్రభాత సూర్య:** ఆలేరు పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి సముద్రాల రవి జన్మదిన ఘనం నిర్వహించరూ. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, కైలాసపురం వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ వ్యవస్థాపకులు డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి శుభాకాంక్షలు తెలిపారు. యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని అందజేసి, శాలువాతో సత్కరించి ఆశీర్వదించారు. అలాగే కైలాసపురం అమ్మవారి మెమెంటోను సముద్రాల రవి అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.





## అల్లి సుభాష్ యాదవ్ కార్పొరేటర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**నల్గొండ ప్రభాత సూర్య:** నల్గొండ పట్టణం పెద్ద బండ, ఎఫ్ సి ఐ అల్లి సుభాష్ యాదవ్ 20 డివిజన్ కార్పొరేటర్ ఆధ్వర్యంలో మరియు డాక్టర్ అగర్వాల్ కంటి క్లినిక్ సహకారంతో శ్రీ నవదుర్గ మెడికల్, జనరల్ స్టోర్స్ పర్యవేక్షణ టి తిరుమలేష్ లతో ఘనంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లి సుభాష్ యాదవ్ మాట్లాడారు పెద్ద బండ ప్రాంతంలో కార్మికులు, కర్షకులు, రైతులు, నిరుపేద ఆర్థిక ఇబ్బందుల వలన కుటుంబాలు ఉన్నందువలన తమ కంటి ఆరోగ్య సమస్యలను తెలుసుకోలేకపోతున్నారు. కావున డాక్టర్ అగర్వాల్ కంటి వైద్యుల సహకారంతో సోమవారం వందలాదిమందికి కంటి శుక్లాలు పరీక్షించి, వారికి ఆరోగ్య సూచనలు చేశారు, పెద్ద బండ ప్రాంతంలో ఇక్కడ ప్రజలను అందత్వం లేని డివిజన్ గా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు, వయసు నిమిత్తం లేకుండా కంటి శుక్ల పరీక్షలు చేయించుకోగలరని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద బండ 20 డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సోదర భావానికి ప్రతీక ఇఫ్తార్

**మస్జిద్ ఏ ఖుబా పాండంగాపురం ఇఫ్తార్లో రఘునాథ పాలెం సిఐ ఉస్మాన్ షరీఫ్**





**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి):** సోదరభావానికి ప్రతీక ఇఫ్తార్ విందులని రఘునాధపాలెం పోలీస్ స్టేషన్ సిఐ ఉస్మాన్ షరీఫ్ అన్నారు.సోమవారం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోనీ పాండురంగాపురం రెండవ డివిజన్లో గల మస్జీద్ ఏ ఖుబా లో పాల్గొని ఆయన మాట్లాడారు. క్రమశిక్షణకు సహనంకు రంజాన్ మాసం ఎంతో పవిత్రతతో కూడుకున్నదని ఐదు పూటల నమాజ్ తో పాటు రంజాన్ ప్రత్యేక తరావీహ్ నమాజు ప్రతి ఒక్కరు ఆచరిస్తూ అల్లాహ్ ను వేడుకుంటూ మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో మనమందరం నడుచుకుందామని ఆయన అన్నారు. ఇఫ్తార్ విందు అనంతరం నమాజు చేసుకొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మస్జిద్ ఏ ఖుబా సదర్ (ప్రెసిడెంట్ ) ఫయాజ్ పూర్వ సదర్ అఫ్జల్మియా బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి సలీం మస్జిద్ మతపెద్ద గులాం రబ్బాని ఖమ్మం జిల్లా ఏఐటీయూసీ నాయకులు షేక్ ఇబ్రహీం టైలర్ హుస్సేన్ భాయ్ ఇంటెలిజెన్స్ ఎస్ ఐ షేక్ రహీం కరాటే ఖాసీం జర్నలిస్ట్ జానిపాషా షేక్ రజిమ్ పోలీస్ చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## శారాజిపేట గ్రామంలో మైనార్టీ కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేసిన బిర్లా ఫౌండేషన్....

**ఆలేరు మార్చి 16 ప్రభాత సూర్య :** ఆలేరు మండలంలోని శారాజీపేట గ్రామంలో పవిత్ర రంజాన్ సందర్భంగా మధ్యతరగతి మైనారిటీ కుటుంబాలకు మానవీయత కోణంలో బీర్ల అనిత బీర్లఫౌండేషన్ ద్వారా రంజాన్ పండుగ సందర్భంగా రంజాన్ తోఫా నిత్య అవసరాలు సమకూర్చిన సందర్భంగా గ్రామ మైనార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంతి మధు, ఉప సర్పంచ్ దూడల శ్రీధర్, విజయ డైరీ చైర్మన్ బత్తుల నరేందర్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కంతి చిలుకు నాగ రాజు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దూడల సంతోష్, నారి మల్లయ్య, పెండ్యాల సత్యనారాయణ , మోరిగాడి శ్రీనివాస్, గండికోట సంతోష్, కంది మహేందర్, మైనార్టీసభ్యులు

ఎండి రసూల్ తదితరులు పాల్గొన్నారు.



# చౌటుప్పల్ మైనార్టీ గురుకుల పాఠశాల కలెక్టర్ ఆకస్మిక తనిఖీ





**విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలి....**

**విద్యార్థులు మంచి ఉత్తీర్ణత ఫలితాలు సాధించాలి...**

**విద్యార్థుల డార్మెంటరీ హాల్ పరిశీలన....**

**పది విద్యార్థులకు ఆల్ ది బెస్ట్....**

**యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**చౌటుప్పల్,మార్చి 16, ప్రభాత సూర్య :** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం మంచి రుచికరమైన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం చౌటుప్పల్ మండలం అంకిరెడ్డి పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న మైనారిటీ వెల్ఫేర్ పాఠశాలను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారని, విద్యార్థులకు బోధించేందుకు ఎంతమంది టీచర్లు ఉన్నారని ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు.పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం ఏర్పాట్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని, ఎప్పటికప్పుడు తాజాగా ఉన్న కూరగాయలు మాత్రమే వంటకు ఉపయోగించాలన్నారు. విద్యార్థులకు భోజనం వడ్డించే ముందు అధికారులు తప్పనిసరిగా రుచి చూసిన తర్వాతనే విద్యార్థులకు వడ్డించాలన్నారు. పాఠశాల వంటగదిని పరిశీలించి విద్యార్థులకు వండుతున్న భోజనాన్ని స్వయంగా ఆయన పరిశీలించారు. విద్యార్థుల డార్మిటరీ హాల్ ను కలెక్టర్ పరిశీలించి గదిలో సీలింగ్ ఫ్యాన్లు అన్ని పని చేస్తున్నాయా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లను పరిశీలించగా టాయిలెట్స్ పరిశుభ్రంగా లేవని,తలుపులు కూడా సరిగా లేవని వెంటనే మరమ్మతులు చేయించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.అనంతరం 10వ తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ... పరీక్షలు జరుగుతున్నందున కష్టపడి చదివి మంచి ఉత్తీర్ణత ఫలితాలు సాధించాలని,వెనుకబడిన సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదవాలని విద్యార్థులకు కలెక్టర్ సూచనలు చేశారు. పరీక్షలు వ్రాసే సమయంలో భయాందోళనకు గురి కాకుండా మంచి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు వ్రాయాలన్నారు.10 వ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం ద్వారా భవిష్యత్ లో ఉన్నత చదువులకు వెళ్ళవచ్చని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి మంచి మార్కులతో పాస్ అవ్వాలని కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలకృష్ణ, సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# మా మామ కుటుంబం నుంచి నన్ను రక్షించాలి - సంద శ్రవణ్

నల్గొండ ప్రభాత సూర్య: నల్గొండ పట్టణం సోమవారం రామగిరి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంద శ్రవణ్ తండ్రి నరసింహ, 33 గ్రామం అప్పాజీపేట, మండలం జిల్లా నల్గొండ., అను నేను ఆగస్టు 17 2022న మిర్యాలగూడ పట్టణానికి చెందిన దాసరి మౌనికను వివాహం చేసుకున్నాను, ఇంతలో ఆరు మాసాలు ఇద్దరం కలిసి మెలిసి కాపురం చేశాం, మా భార్య వాళ్ళ అన్నయ్య అయినా దాసరి మహేష్ అవసరం నిమిత్తం మేరకు అప్పుగా లక్ష పది వేల రూపాయలు ఇచ్చాను, కానీ నా అవసరం మేరకు తిరిగి మళ్ళీ అడిగితే బెదిరిస్తూ నన్ను పర్ష పదజాలంతో దుర్భాషలాడాడు, ఇంతలో నా యొక్క భార్య డెలివరీ కోసానికి తన స్వగృహం అయినా మిర్యాలగూడ కు వెళ్ళింది. అక్కడ మా బామ్మర్ది అయినా దాసరి మహేష్ మా చెల్లెను మీ ఇంటికి పంపిస్తా తీసుకెళ్లని నాకు ఫోన్ చేశాడు. నేను మిర్యాలగూడకు నా భార్యను తీసుకోవడానికి ఇంటికి వెళ్లాను. కానీ వారి ఇంటి దగ్గర వారి బంధువులచే భౌతిక దాడి చేసి బలమైన గాయాలు చేయడం జరిగింది ఇట్టి విషయంపై రూరల్ నల్గొండ పోలీస్ స్టేషన్ వారికి చినిగిన దుస్తులు గాయాలతో కంప్లైటీ ఇచ్చిన కానీ వారు ఏమాత్రం




విచారించి కేసు నమోదు చేయలేదు, యొక్క అంశం పలు సామాజిక మాధ్యమాలైన వే టు న్యూస్ లో ప్రసరించడం జరిగింది. ఈ విషయంపై నాకు న్యాయం జరగలేనందున హైదరాబాదులో గల డీజీపీ కార్యాలయానికి వెళ్లిన అక్కడ ఫిర్యాదు కూడా చేశాను. డిజిపి కార్యాలయం కూడా నాకు న్యాయం జరగలేదు. నువ్వు డిజీపి కార్యాలయానికి వెళ్తావా అని కోపంతో ఉమెన్ పోలీస్ స్టేషన్ లో నాపై ఫిర్యాదు చేసి పోలీసు వారిచే కొట్టడం జరిగింది. నా భార్య నాపై అవాస్తవాలు నిరాధార ఆరోపణలు చేస్తూ తనకిష్టం లేనందువలన ఈ విధంగా వ్యవహరిస్తుందని తెలిపారు. నేను ఒక అనాధను నాకు అంటూ కుటుంబం ఎవరూ లేరు, నా యొక్క బలహీనతలు మా అత్తగారు ఈ విధంగా వ్యవహరిస్తున్నారు. గత రోజుల క్రితం నాపై మిర్యాలగూడ పోలీస్ స్టేషన్లో గృహహింస నిరోధక చట్టం , వరకట్నం చట్టమైన 498ఏ కేసు నమోదు చేయడం జరిగింది. నా భార్య నా దగ్గర లేనప్పుడు నేను ఎలా గృహ హింస చేస్తాను, ఈ విధంగా తనని కట్నం అడుగుతాను సాధ్యమేనా, పోలీసు వారు న్యాయమైన విచారణ చేసి నిజానిజాలు తెలుసుకొని పూర్తిగా విచారించి న్యాయం చేస్తారని మరొకసారి ఆశిస్తున్నాను పోలీసు వారిని వేడుకున్నారు. అదేవిధంగా మా అత్తగారు నుండి నాకు ప్రాణ భయం ఉన్నందువలన పోలీసు వారు రక్షణ కల్పించి జీవించే హక్కును ప్రసాదించాలని నల్గొండ జిల్లా పోలీస్ వారికి విజ్ఞప్తి చేశారు.

## వేసవిలో గ్రామాల్లో నీటి ఎడది రాకుండా గ్రామస్థాయి అధికారులు చూడాలి




మిర్యాలగూడ మార్చి 16:- (ప్రభాత సూర్య) మిర్యాలగూడ మండల ప్రత్యేక అధికారి డాక్టర్ జూలకంటి వెంకట్ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.శేషగిరిశర్మ, రాఘవరావు డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవరావు, మండల పంచాయతీ అధికారి మతంగి రమేష్, సహాయ ఇంజనీర్ ఆర్డబ్ల్యూఎస్ భవాని సహాయ ఇంజనీర్ పంచాయతీ రాజ్ వరలక్ష్మి పంచాయతీ కార్యదర్శులు సర్పంచులతో రాబోయే వేసవి కాలంలో నీటి ఎద్దడి నివారణ కొరకు సమావేశం ఏర్పాటు చేశారు. అందులో గ్రామ పంచాయతీ నిధుల నుండి పైపులైను రిపేరు గేట్ వాల్ రిపేర్ లు ఓపెన్ టాప్స్ కు ఆన్ ఆఫ్ లో బిగించడం మోటార్ల రిపేర్లు మొదలగునవి చేపట్టుట చేయాలని తెలిపినారు. కొత్త మోటార్లు కొనుగోలుకు అద్దె బోర్లు చెల్లించుట ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల రిపేర్లు మొదలగునవి ప్రతిపాదనలు పంపుటకు సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్లకు సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుండి అమలు చేయు గ్రామపంచాయతీ భవనాలు వివో భవనాలు సిమెంటు రోడ్లు, అంగన్వాడి భవనాలు, టాయిలెట్స్ ఇంకా ప్రారంభం కాని వాటిని వెంటనే ప్రారంభించాలని సర్పంచ్లకు సూచించారు. 31 మార్చి లోపల వాటిని పూర్తిచేయాలన్నారు. ఉగాది పండుగకు చివరి దశ నిర్మాణంలో ఉన్న ఇండ్లను సామూహిక గృహప్రవేశం చేయుటకు లబ్ధిదారులను ప్రోత్సహించాలని తెలిపినారు. ప్రతి గ్రామంలో 100 శాతం టాక్స్ వసూలు చేయాలని తెలిపినారు అదేవిధంగా వచ్చే సంవత్సరం పన్ను వసూలు డిమాండ్ తయారు చేయాలని తెలిపారు. అన్ని గ్రామాలలో తడి చెత్త పొడి చెత్త ప్రతి ఇంటి నుండి సేకరించి సెగ్రిగేషన్ షెడ్ కు తరలించి సేంద్రియ ఎరువు తయారు చేయాలని తెలిపారు. ఇంకా మొక్కలు మొలకెత్తని నర్సరీలలో మేలు రకమైన నారు తెచ్చి నాటించి జూన్ నెలలో వనమహోత్సవం కార్యక్రమానికి ఐదారు ఫీట్ల మొక్కలను పెంచి సిద్ధం చేయాలన్నారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు ఆదర్శవంత గ్రామాలు తయారు చేయాలన్నారు.



## మార్చి 31 వకు తెలంగాన అసెంబ్లీ

**20న సభల బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి**

**ఉగాది, రంజాన్, శ్రీరామనవమికి సెలవులు**

**బిఎసి సమావేశంలో నిర్ణయం**

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 31 వరకు జరగనున్నాయి. ఈ మేరకు బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షత బీఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశాల నిర్వహణపై కీలక నిర్ణయం తీసుకున్నారు. మార్చి 16 నుంచి మార్చి 31 వరకు సమావేశాలను నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. సోమవారం ఉదయం గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగంతో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం అనంతరం స్పీకర్ సభను మంగళవారం వాయిదా వేశారు. అనంతరం స్పీకర్ ఛాంబర్లో బీఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై చర్చించారు. మార్చి 17, 18న గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదం తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. ఈనెల 20న అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెను ప్రవేశపెట్టనుంది. ఆపై 23 నుంచి 26 వరకు బడ్జెట్పై చర్చలు జరపనున్నారు. మార్చి 31న ద్రవ్య వినిమియ బిల్లుపై చర్చ జరగనుంది. అలాగే ఉగాది, రంజాన్, శ్రీరామనవమికి అసెంబ్లీకి సెలవులు ప్రకటించనున్నారు. బీఏసీ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, విప్ బీర్ల ఐలయ్య హాజరయ్యారు. బీఆర్ఎస్ నుంచి హరీశ్ రావు, కేపీ వివేక్ హాజరవగా.. బీజేపీ నుంచి మహేశ్వర్ రెడ్డి, ఎంఐఎం నుంచి అక్బరుద్దీన్, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు సమావేశంలో పాల్గొన్నారు.

# ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీక ...




## బండ్రు శోభారాణి, జనగాం ఉపేందర్ రెడ్డి...

**ఆలేరు మార్చి 16 ప్రభాత సూర్య:** ముస్లిం సోదరులకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి, రాష్ట్ర టిపిసిసి ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి అన్నారు. రంజాన్ మాసం మనుషుల్లో సేవ భావం, త్యాగం, సోదర భావం మరియు మరియు ఆత్మశుద్ధిని పెంపొందించే పవిత్రమైన కాలమని వారు పేర్కొన్నారు. ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో స్థానిక వైఎస్ఎన్ గార్డెన్లో తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా జిల్లా మైనార్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి, రాష్ట్ర టిపిసిసి ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస విరమణ చేసి ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం ముస్లిం పెద్దలను ఆప్యాయంగా పలకరించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ మాసం మనవాళికి శాంతి, ప్రేమ, దయ బోధించే పవిత్రమైన మాసం అని తెలిపారు. ఉపవాస దీక్షలు పాటిస్తూ పరమాత్మ ను ప్రార్థించడం ద్వారా మనసుకు ప్రశాంతత లభించడమే కాకుండా సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం పెరుగుతాయని చెప్పారు. ఇఫ్తార్ విందులు వివిధ మతాలకు ప్రజలను ఒకే వేదిక పైకి తీసుకువచ్చి పరస్పర అవగాహన పెంచుతాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని రంజాన్ పండుగ సందర్భంగా నిర్వహించే ఇఫ్తార్ విందు కూడా మత సామరస్యాన్ని బలోపితం చేయటానికి ప్రభుత్వం తీసుకుంటున్న ముఖ్యమైన చర్యల్లో బాగామని తెలిపారు. భిన్నా మతాలు, సంస్కృతులు ఉన్నప్పటికీ మనమందరము భారతీయులమనె భావనతో ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రంజాన్ పర్వదిన సందర్భంగా సమాజంలో ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వం మరింత పెరగాలని ఆకాంక్షిసూ ముస్లిం సోదరులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీజాన బాలమణి భాస్కర్, వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయులు, కౌన్సిలర్లు వానరాసి మరియమ్మ మార్కు, జెట్ట నిరజ సిద్ధులు, పస్తం ఆంజనేయులు, జూకంటి సంపత్, తాసిల్దార్ ఆంజనేయులు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎంఎ ఎజాజ్, మండల అధ్యక్షుడు కొండరాజు వేంకటేశ్వర రాజు, శారజిపేట గ్రామ సర్పంచ్ కంతి మధు, నాయకులు చింతకింది మురళి, ఎమ్మెస్ విజయకుమార్, ఎండి జైనువుద్దీన్, ఎండి సలీం, ముదికొండ శ్రీకాంత్, ఆలేటి అనిల్, చిక్క శ్రావణ్, ఎండి ఖలీల్, ముస్లిం కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక ప్రయోజనాలను,కార్మిక చట్టాలను హక్కులను హరించివేసే లేబర్ కోడ్ లను రద్దు చేయాలి..

## ఆర్.జనార్ధన్, ఐ ఎఫ్ టి యు తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు ..






**రాయగిరి బోనగిరి మార్చి 16 ప్రభాత సూర్య..** . కార్మిక వర్గ ప్రయోజనాలకు ఏమాత్రం కూడా ఉపయోగపడని,కార్మికుల శ్రమను యాజమాన్యాలు యదేచ్చగా దోపిడీ చేయడానికి ఉపయోగపడే 4 కార్మిక వ్యతిరేక కోడ్ లను ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలుకు పూనుకుండా వెంటనే అమలు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేదంటే బీ జే పీ పతనం తప్పదని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐ ఎఫ్ టి యు)తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.జనార్ధన్ హెచ్చరించారు. సోమవారం రోజున 4 లేబర్ కోడ్ ల అమలును వెంటనే వెనక్కి తీసుకొని పాత కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఐ ఎఫ్ టి యు జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు భువనగిరి కలెక్టర్ కార్యాలయం ముందు ఐ ఎఫ్ టి యు జిల్లా కమిటీ ఆద్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ బీ జే పీ ప్రజా ప్రయోజనాల కోసం ఎప్పుడూ కూడా ఆలోచించడం లేదని,రైతులకు మేలుచేస్తాయని చెప్పి మూడు రైతు చట్టాలను తెస్తే రైతాంగం త్రిప్పి కొట్టారని,మోడీ బీ జే పీ వెనక్కి తీసుకోక తప్పలేదని,కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను హక్కులను కాలరాయడం కార్మిక వర్గం తీవ్రంగా ప్రతిఘటించాలని అన్నారు. అలాగే ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మ సుదర్శన్, గడ్డం నాగరాజు లు మాట్లాడుతూ కార్మికులకు నష్టదాయకమైన 4 లేబర్ కోడ్ లు కార్మికులను చట్టబద్ధంగా, ఎదురు లేకుండా దోచుకోవడానికే ఉపయోగపడుతాయి తప్ప వారి సంక్షేమం కోసమే కావని అన్నారు.వేతనాలు పెంచాలని, సమాన పనికి సమాన వేతనం,శాశ్వత ఉద్యోగాలు, మెరుగైన వేతనాలు,సౌకర్యాలు లేకుండా చేయడమే లేబర్ కోడ్ ల,ప్రభుత్వాల,యాజమాన్యాల ఉద్దేశ్యం అని అన్నారు.4 లేబర్ కోడ్ లను ఏ పరిస్థితుల్లో కూడా అమలు చేయకుండా ఐ ఎఫ్ టి యు పెద్ద ఎత్తున పోరాడుతుందని,ఐక్య ఉద్యమాలు నిర్మిస్తుందని అన్నారు.

ధర్నా అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏ ఓ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు అనుబంధ యూనియన్ ల నాయకులు కల్లెపు చంద్రయ్య,బుషే శ్రీశైలం,బుగ్గ నర్సింహులు, కొంగరి సాయిరామ్, పీ వై ఎల్ జిల్లా కోశాధికారి పగడాల శివ,బీబీనగర్ నర్సింహులు,సుంచు అంజయ్య,కడకంచి అంజయ్య,కడకంచి బీరయ్య,ఊరడి రామ చంద్రు,పోతగల్ల నర్సింహులు,గోరుగంటి ముత్యాలు, బండి సిద్ధులు,మొద్దుల మహేందర్,కోయ బాబు,జూకంటి చంద్రయ్య, కొజ్జిగ వీరయ్య, పోతగల్ల బాలయ్య, పి.సుధాకర్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కవి నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

## కరోనా కష్టాలపై రాసిన అనిమేషకు గాను అవార్డు ప్రకటన

## సిధారెడ్డికి అవార్డుపై సాహితీవేత్తలు, కెసిఆర్, కెటిఆర్ హర్షం

హైదరాబాద్: తెలంగాణ కవి, రచయిత నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు 2025 లభించింది. ఆయన కవితా సంపుటి 'అనిమేష' లో కరోనా కాలంలో ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభాలను, మానవ సంబంధాల విచ్ఛిన్నతలను హృద్యంగా చిత్రీకరించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి ఛైర్మన్‌గా, మంజీరా రచయితల సంఘం ద్వారా తెలుగు సాహిత్యానికి కొత్త ఊపునిచ్చి, తెలంగాణ ఉద్యమానికి తన కవిత్వం ద్వారా గొప్ప సహకారానిచ్చిన ఆయన తెలంగాణ సాహిత్యానికి గర్వకారణం. నందిని సిధారెడ్డి తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్‌గా పనిచేశారు. తన కలం ద్వారా తెలంగాణ సంస్కృతి, ఆత్మ, జీవన విధానాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా తెలంగాణ సాహిత్యానికి అగ్రగామిగా నిలిచారు. ఆయన రచనలు కేవలం కవిత్వం మాత్రమే కాక, తెలంగాణ జీవితం, ప్రజల సమస్యలు, ఉద్యమం వంటి అంశాలను స్పష్టంగా ప్రతిబింబిస్తాయి. మెదక్ జిల్లా కేంద్రంగా 'మంజీరా రచయితల సంఘం' స్థాపించి, ఎందరో వర్ధమాన కవులను, రచయితలను ప్రోత్సహించారు. సాహిత్యానికి ప్రాంతీయతను అద్దడంలో ఆయనది ప్రత్యేక శైలి. ఈ సంఘం ద్వారా తెలుగు సాహిత్యంలో నూతనవాణి, విభిన్న అభివ్యక్తులు, సామాజిక చైతన్యానికి వేదికైంది. ఈ సంఘం తెలుగు సాహిత్యానికి కొత్త వన్నె తెచ్చి, యువ రచయితలకు ప్రేరణనిస్తూ, తెలంగాణ స్వరాష్ట్ర ఆకాంక్షను, ఆవశ్యకతను తన సృజనాత్మక రచనల ద్వారా చాటుతూ తెలంగాణ ఉద్యమానికి గొప్ప ఊపునిచ్చింది. ఈ అవార్డు తెచ్చిపెట్టిన 'అనిమేష' కవితా సంపుటి కేవలం అక్షరాల కూర్పు కాదు అది ఒక కాలానికి దర్పణం. ప్రపంచాన్ని వణికించిన కరోనా కాలంలోని సామాజిక పరిస్థితులు, మానవ సంబంధాలు, వలస కూలీల కష్టాలు, ఒంటరితనాన్ని ఈ సంపుటిలో కళ్లకు కట్టారు. 'అనిమేష'లో కరోనా సమయంలో ప్రపంచం ఎదుర్కొన్న సామాజిక, ఆర్థిక, మానవ సంబంధ సమస్యలను నందిని సిధారెడ్డి హృద్యంగా చిత్రీకరించారు. మానవ సంబంధాల విచ్ఛిన్నత, సమాజంలో ఒంటరితనం, ఆందోళన, సామాజిక కలతలను ప్రతిబింబింపజేసే నందిని సిధారెడ్డి కవిత్వం పాఠకులకు ప్రేరణగా నిలుస్తోంది. 'నాగేటి సాల్లళ్ల నా తెలంగాణ' వంటి పాటల ద్వారా తెలంగాణ పల్లె జీవనాన్ని, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయన పాటలు ప్రజలను ఉర్రూతలూగించడమే కాకుండా, స్వరాష్ట్ర ఆకాంక్షను బలోపేతం చేశాయి. తెలంగాణ స్వతంత్ర రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో నందిని సిధారెడ్డి పాటలు, కవిత్వం ద్వారా ప్రజలను ఆలోచింపజేశారు. ఆయన రచనలు రాష్ట్ర ఉద్యమానికి ఉత్సాహాన్ని నింపాయి. ప్రజల సమస్యలను కవిత్వం ద్వారా తెలియజేయడం, ఉద్యమ కవిగా ప్రజల అభిమానాన్ని పొందడం ఈ విధంగా తెలంగాణ ఉద్యమంలో నందిని సిధారెడ్డి కీలక పాత్ర పోషించారు.

# భారీగా పెరిగిన ముడి చమురు ధరలు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి:పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రపంచ చమురు మార్కెట్లలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇంధన రవాణాకు అంతరాయం కలుగుతున్న కారణంగా ముడిచమురు ధరలు వేగంగా పెరుగుతున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయిల్,అమెరికాలు దాడులు కొనసాగించడం తో ప్రాంతీయ ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఈ పరిణామాల ప్రభావంతో అంతర్జాతీయ చమురు ధరలు మరోసారి 100 డాలర్లను దాటాయి. బ్యారెల్ ధర 106 డాలర్లకు చేరుకోగా,ధర సుమారు 2.6 శాతం పెరిగి 101 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇరాన్‌పై దాడులు ప్రారంభమైన తర్వాత చమురు మార్కెట్లలో గణనీయమైన పెరుగుదల నమోదై, ధరలు దాదాపు 40 శాతం వరకు పెరిగి 2022 తర్వాతి గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ఇంధన రవాణా భద్రతను కాపాడేందుకు ప్రపంచ దేశాలు కలసి చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో వివిధ దేశాలతో చర్చలు కొనసాగుతున్నట్లు ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా, దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం 9:43 గంటల సమయానికి 330 పాయింట్లు పెరిగి 74,894 వద్ద ఉండగా, 50 106 పాయింట్లు లాభపడి 23,257 వద్ద ట్రేడవుతోంది. గత వారం భారీ పతనం తర్వాత కనిష్ఠ స్థాయిల వద్ద మదుపర్లు కొనుగోళ్లు ప్రారంభించడంతో మార్కెట్లు కొంత కోలుకున్నాయి. షేర్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

# ఆరు గ్యారెంటీలపై అసెంబ్లీలో నిలదీస్తాం

## గన్‌పార్క్ వద్ద అమరులకు కెటిఆర్ తదితరుల నివాళి



హైదరాబాద్,మార్చి16:ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు ఠంచనుగా పడేదని గుర్తుచేశారు. అదే కాంగ్రెస్ పాలనలో పంటలు ఎండిపోతున్నా రైతుబంధు దిక్కులేదని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్తూపానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. శాసనసభ సమావేశాలకు ముందు అమరవీరుల స్థూపానికి నివాళు లర్పించామని తెలిపారు. అమరవీరుల స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ, వారి త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. రెండున్నరేళ్లవుతున్నా ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించలేదని విమర్శించారు. ఆనాడు గవర్నర్‌తో చట్టబద్ధత కల్పిస్తామని చెప్పించారని తెలిపారు. పంటల వేసే నాటికి కేసీఆర్ రైతుబంధు నిధులు వేసేవారని కేటీఆర్ గుర్తుచేశారు. రాహుల్ బంధు కాదు.. రైతుబంధు వేయాలని కోరారు. రైతులకు వెన్నుపోటు.. రాహుల్‌కు వెయ్యి కోట్లా అని నిలదీస్తామని అన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాల ఊసే లేదని.. రైతుబంధుకు దిక్కే లేదని విమర్శించారు. వృద్ధులు పింఛన్లు, రైతులు, రైతు కూలీలు రైతు భరోసా కోసం ఎదరుచూస్తున్నారని తెలిపారు. జాబ్ క్యాలెండర్‌లో ఉత్త క్యాలెండర్ తప్ప జాబ్‌లు కనిపించడం లేదని అన్నారు. ఇలా అన్ని వర్గాలను కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని అన్నారు. ఆరు గ్యారంటీలకు రేవంత్ సర్కార్ మంగళం పడిందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేసిందని అన్నారు. కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలపై అసెంబ్లీలో నిలదీస్తామని స్పష్టం చేశారు.

# పీక్ష హాలులో పాము ప్రత్యక్షం

## కంగారుతో విద్యార్థుల పరుగు

కడప,మార్చి: కడప జిల్లా బి.కోడూరులోని పదో తరగతి పరీక్ష కేంద్రంలోకి పాము రావడం కలకలం రేపింది. పామును చూసిన విద్యార్థులు ఒక్కసారిగా పరుగులు పెట్టారు. వెంటనే అక్కడి సిబ్బంది పామును చంపి బయటపడేయడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ఉదయమే పరీక్షకు హాజరైన విద్యార్థులు తమకు కేటాయించిన రూమ్‌లోకి ఎంటర్ అయ్యారు. అక్కడ లోపల ఉన్న పామును చూసి అరుస్తూ విద్యార్థులు బయటకు పరుగులు తీసారు. విషయం తెలిసిన అధికారులు వెంటనే పామును పట్టుకునే ప్రయత్నం చేశారు. పామును పట్టుకుని తరలించడంతో ఊపిరి పీల్చుకున్నారు. చివరకు ప్రశాంతంగా పరీక్షహాల్లోకి ఎంటర్ అయ్యారు.

# ప్రజలకిచ్చిన హామీలపై స్పష్టత ఏదీ

## ఉద్యోగుల బకాయిలపై ప్రస్తావన లేదే

## గవర్నర్ ప్రసంగంపై బిజెపి పెదవి విరుపు

హైదరాబాద్: గవర్నర్ ప్రసంగంలో ప్రజలకు ఇచ్చిన హామీల గురించి ఎలాంటి ప్రస్తావన లేదని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. రైతుల ఇబ్బందులు, ఉద్యోగాల భర్తీ గురించి లేదని, ఉద్యోగుల సమస్యలపై ప్రస్తావించలేదని తెలిపారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తీవ్ర విమర్శలు చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ... విశ్రాంత ఉద్యోగులు గోస పడుతున్నారని... ఎన్నేళ్లు అయినా వారికి బెనిఫిట్స్ అందడం లేదని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన చట్టాలు ఉన్నప్పటికీ వారికి అందాల్సిన సౌకర్యాలు అందడం లేదని ఎమ్మెల్యే విమర్శించారు. బీసీలను పూర్తిగా మోసం చేస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారు. సబ్ ప్లాన్ ముచ్చటే లేదన్నారు. ప్రభుత్వ అప్పులపై స్పష్టత లేదని తెలిపారు. గవర్నర్‌తో ప్రభుత్వం ఏదైనా మాట్లాడించేటప్పుడు ఆలోచించాలని.. అన్నీ అవాస్తవాలు, గందరగోళమైన మాటలు మాట్లాడించారని బీజేపీ ఎమ్మెల్యే ఆరోపించారు. ప్రభుత్వం విస్మరించినంత మాత్రాన తాము విడిచిపెట్టమని... తెలంగాణ ప్రజల గొంతుకగా బీజేపీ నిలబడి పనిచేస్తుందన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్పష్టం చేశారు.

# ఎల్‌పీజీ కొరతతో.. ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్..




దేశంలో ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల కొరత రోజు రోజుకు తీవ్రమవుతోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తలతో దేశీయంగా ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. హోటళ్లు, రెస్టారెంట్లతో పాటు దిగ్గజ కంపెనీల్లో క్యాంటీన్లు మూసవేస్తున్నారు. ఈ క్రమంలో ప్రముఖ టెక్ కంపెనీ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ కంపెనీ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని నిర్ణయించింది. మరి ఎక్కడి ఉద్యోగులకు ఇది వర్తిస్తుంది? అనే వివరాలను తెలుసుకుందాం. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలతో దేశీయంగా ఎల్‌పీజీ సంక్షోభం తలెత్తింది. వంట గ్యాస్ సరఫరా తగ్గిపోవడంతో దేశీయంగా హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాంటీన్లు మూతపడుతున్నాయి. గృహ వినియోగ సిలిండర్ల కోసం సైతం ప్రజలు గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు తీరుతున్నారు. ఈ క్రమంలో దేశంలోని దిగ్గజ టెక్ కంపెనీల్లో ఒకటైన హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ (ఎజూ ఎవఎఫ్ట్ర) కీలక నిర్ణయం తీసుకుంది. వంట గ్యాస్ కొరత కారణంగా తమ చెన్నై ఆఫీసులోని ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ కల్పిస్తున్నట్లు తెలిపింది. వంట గ్యాస్ లేకపోవడంతో కెఫ్‌టేరియా ఆపరేషన్స్ పూర్తిగా ఆగిపోయాయని, ఉద్యోగులకు ఆహారం లేకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీకి చెందిన సీనియర్ ఎగ్జిక్యూటివ్స్‌ని ఉటంకిస్తూ జాతీయ మీడియా సంస్థలు పేర్కొన్నాయి. గ్యాస్ కొరతతో క్యాంటీన్ మూతపడే పరిస్థితులు తలెత్తి చెన్నైలోని ఐటీ ఉద్యోగులకు హెచ్‌సీఎల్ టెక్ 2 రోజుల పాటు వర్ ఫ్రమ్ హోమ్ కల్పించింది. మార్చి 12, మార్చి 13 తేదీల్లో ఇంటి నుంచి పని చేయాలని కోరింది. కొనసాగుతున్న ఎల్‌పీజీ గ్యాస్ సంక్షోభం కారణంగా కెఫ్టేరియా విక్రేతలు తమ కార్యకలాపాలను నిర్వహించలేకపోయారని, దీనితో కంపెనీ సిబ్బంది రెండు రోజులు రిమోట్‌గా పని చేయడానికి అనుమతించినట్లు ఎగ్జిక్యూటివ్స్ తెలిపారు. అయితే, ఈ విషయంపై హెచ్‌సీఎల్ టెక్నాలజీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఎల్‌పీజీ కొరతపై ప్రభుత్వం ప్రజలకు ఎప్పటికప్పుడు భరోసా కల్పిస్తున్నా దేశవ్యాప్తంగా మూతపడుతోన్న రెస్టారెంట్లు, హోటళ్ల సంఖ్య క్రమంగా పెరుగుతూనే ఉంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం తీవ్ర రూపం దాల్చడం, గల్ఫ్ దేశాలపై మిసైళ్ల దాడి, హార్మూజ్ జల సంధిని మూసివేయడం వంటి కారణాలతో భారత్‌పై తీవ్ర ప్రభావం పడుతోంది. దేశంలో ఇంధన కొరత నెమ్మదిగా పెరుగుతోంది. గ్యాస్ కొరత నేపథ్యంలో ప్రభుత్వం ఇటీవలే 14.2 కిలోల గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధరను రూ.60 మేర పెంచింది. అలాగే 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధరను రూ.144 మేర పెంచింది.

**ఇన్ఫోసిస్ కీలక సూచన**

మరో టెక్ దిగ్గజం ఇన్ఫోసిస్ తమ బెంగళూరు ఉద్యోగులకు కీలక సూచనలు చేసింది. తమ బెంగళూరు ఆఫీసులోని కెఫ్టేరియా కొద్ది రోజులు తక్కువ ఆహార పదార్థాల మెనూతో కొనసాగుతుందని తెలిపింది. వాణిజ్య సిలిండర్ల సరఫరా తగ్గించిన క్రమంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఉద్యోగులు ఇంటి నుంచే భోజనం తెచ్చుకోవాలని కోరింది. మరోవైపు ఇన్ఫోసిస్ కంపెనీలో మొత్తం 3,37,034 మంది ఉద్యోగులు ఉండగా అందులో నాలుగింట మూడు వంతులు భారత్‌లోనే పని చేస్తున్నారు. అలాగే హెచ్‌సీఎల్ టెక్నాలజీలో 2,26,379 మంది పని చేస్తుడంగా అందులో మూడింతల ఉద్యోగులు భారత్‌లోనే పని చేస్తున్నారు. ప్రధాన కార్యాలయలాల్లోని కెఫ్టేరియాలు మూతపడే అవకాశం ఉంది. దీంతో ఉద్యోగులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకోవడం లేదా ఇంటి నుంచే పని చేసే నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

# రైతుల అకౌంట్లలోకి నేడే పీఎం కిసాన్ డబ్బులు



పీఎం కిసాన్ స్కీమ్ కింద 22వ విడత నిధుల్ని.. మార్చి 13న అసోం గువాహటి నుంచి ప్రధాని నరేంద్ర మోదీ రైతుల ఖాతాల్లోకి విడుదల చేయనున్నారు. ఈసారి 9.32 కోట్ల రైతుల ఖాతాల్లో రూ. 18,640 కోట్లు జమ కానున్నాయి. గతంతో పోలిస్తే లబ్ధిదారుల సంఖ్య ఈసారి తగ్గింది, రైతులకు డబ్బులు పొందాలంటే ఇ- కేవైసీ తప్పనిసరి. పూర్తి వివరాల్ని ఇప్పుడు చూద్దాం. దేశంలో రైతులకు పంట పెట్టుబడి సాయం కోసం ఉద్దేశించిన గొప్ప పథకాల్లో ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన ఒకటి. దీని గురించే ప్రధానంగా చెప్పుకోవాలి. సాగుకు రైతులు ఇబ్బంది పడకుండా వారికి కొంత మేర ఆర్థిక సాయం అందిస్తుంది కేంద్రం. ఏడేళ్ల కిందట ఈ స్కీమ్ ప్రారంభించగా.. ఏటా 9 కోట్ల మందికిపైగా రైతులు ప్రయోజనాల్ని పొందుతున్నారు. ఇప్పటివరకు ప్రతి విడతలో రూ. 2 వేల చొప్పున 21 విడతల్లో డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయగా.. ఇప్పుడు 22వ విడత డబ్బులు విడుదల కానున్నాయి. మార్చి 13న (శుక్రవారం) సాయంత్రం 5 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ.. అసోంలోని గువాహటి కేంద్రంగా ఈ నిధుల్ని లబ్ధిదారుల అకౌంట్లలో జమ చేయనున్నారు. ఇప్పుడు మొత్తంగా 9.32 కోట్ల మంది అకౌంట్లలో రూ. 18,640 కోట్లు జమ కానున్నాయని పేర్కొంది కేంద్రం. ఈ స్కీమ్ విషయానికి వస్తే ఏటా కేంద్రం అర్హులైన రైతుల ఖాతాల్లో రూ. 6 వేలు జమ చేస్తుంది. దీనిని మొత్తం ఒకేసారి కాకుండా.. 3 విడతల్లో రూ. 2 వేల చొప్పున అందిస్తుంది. 3 విడతల్ని ఏప్రిల్- జులై, ఆగస్ట్- నవంబర్, డిసెంబర్- మార్చి గా విభజించింది. ఇప్పుడు డిసెంబర్- మార్చికి సంబంధించి రానున్నాయి. సాధారణంగా ఈ విడత ఎప్పుడూ ఫిబ్రవరిలోనే జమవుతుంటుంది కానీ ఈసారి మాత్రం అనర్హుల ఏరివేత ప్రక్రియ ముమ్మరంగా సాగడంతో కాస్త వాయిదా పడింది. ఈ క్రమంలోనే లబ్ధిదారుల సంఖ్య కిందటి సారితో పోలిస్తే 3 లక్షలకుపైగా తగ్గింది. 21వ విడతలో మొత్తం లబ్ధిదారుల సంఖ్య 9.35 లక్షలుగా ఉండగా.. ఇప్పుడు 9.32 కోట్లకు పడిపోయింది. ఇ- కేవైసీ చేయని వారు సహా అనర్హులై ఉండి ప్రయోజనాల్ని పొందుతున్న వారిని లిస్ట్ నుంచి తొలగించినట్లు తెలుస్తోంది. గత కొంత కాలంగా కూడా పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు తగ్గారు. 2022-23 ఏప్రిల్- జులై సమయంలో ఏకంగా 10.48 కోట్ల వరకు ఉండగా.. ఇది 1.10 కోట్లకుపైగా తగ్గింది.

**ఇ- కేవైసీ ఎలా చేసుకోవాలంటే?**

పీఎం కిసాన్ డబ్బులు అందుకోవాలంటే రైతులు తప్పనిసరిగా ఇ- కేవైసీ పూర్తి చేయాల్సి ఉంటుంది. వీరికే డబ్బులు వస్తాయి. పీఎం కిసాన్ పోర్టల్‌లో ఆధార్ బేస్డ్ ఓటీపీ వెరిఫికేషన్ ద్వారా చేసుకోవచ్చు. కామన్ సర్వీస్ సెంటర్లలో బయోమెట్రిక్ బేస్డ్ కేవైసీ చేసుకోవచ్చు. పీఎం కిసాన్ మొబైల్ యాప్‌లో ఫేస్ అథెంటికేషన్‌తో కేవైసీ ప్రక్రియ పూర్తి చేయొచ్చు. పీఎం కిసాన్ పోర్టల్‌లో ఫార్మర్స్ కార్నర్‌లో రిజిస్ట్రేషన్ నంబర్ ద్వారా స్టేటస్ తెలుసుకోవచ్చు. మీ జిల్లా, మండలం, బ్లాక్, గ్రామం వంటి వివరాల్ని నమోదు చేయడం ద్వారా బెనిఫిషియరీ లిస్ట్‌లో మీ పేరుందో లేదో కూడా తెలుసుకోవచ్చు.

**వీరికి మాత్రం రావు..**

పీఎం కిసాన్ స్కీమ్ నిబంధనల ప్రకారం.. 2019, ఫిబ్రవరి 1 తర్వాత ల్యాండ్ కొనుగోలు చేసిన వారికి.. భూయాజమాన్య హక్కులు అందుకున్న వారికి డబ్బులు రావు. ఇంట్లో ఒకరికి మించి ప్రయోజనాల్ని పొందుతున్నా ఉదాహరణకు తండ్రీకొడుకు, భార్యాభర్త ఇలా ఉంటే అనర్హులే. వీరికి ప్రయోజనాల్ని తాత్కాలికంగా ఆపివేసి.. వెరిఫికేషన్ తర్వాత నిర్ణయం తీసుకుంటుంది కేంద్రం. టాక్స్ పేయర్లు, రిటైర్డ్ ఉద్యోగులు, నెలకు రూ. 10 వేలకుపైగా పెన్షన్ తీసుకునేవారు, ప్రజాప్రతినిధులు వంటి వారు కూడా అనర్హులే అని గుర్తుంచుకోవాలి.

# ఉత్సవ్ స్కీమ్ మళ్లీ తెచ్చిన బ్యాంక్.. మార్చి 31 వరకే ఛాన్స్.. 5 లక్షలు జమ చేస్తే ఎంతొస్తుంది?




ప్రముఖ బ్యాంకుల్లో ఒకటైన ఐడీబీఐ బ్యాంక్ తమ కస్టమర్ల కోసం ప్రత్యేక డిపాజిట్ స్కీమ్ ఉత్సవ్ ఎఫ్‌డీ పథకాన్ని మరోసారి తీసుకొచ్చింది. ఉత్సవ్ ఎఫ్‌డీ స్కీమ్ గడువును మార్చి 31వ తేదీ వరకు పొడిగించింది. జరనల్ కస్టమర్లతో పాటు సీనియర్ సిటిజన్లకు గరిష్ఠ వడ్డీ ఆఫర్ చేస్తోంది. మరి ఈ స్కీమ్ టెన్యూర్ ఎంత, రూ.5 లక్షలు జమ చేస్తే ఎవరికి ఎంతొస్తుంది? అనే వివరాలు తెలుసుకుందాం. ప్రస్తుత అనిశ్చిత పరిస్థితుల్లో చాలా మంది రిస్క్ లేని స్థిరమైన రాబడి అందించే ఫిక్స్‌డ్ డిపాజిట్లనే ఎంచుకుంటున్నారు. అయితే, గత ఏడాది నుంచి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (=దీ×) పాలసీ రేట్లను భారీగా తగ్గించడంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి దిగ్గజ బ్యాంకులన్నీ ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీ రేట్లను భారీగా తగ్గించాయి. దీంతో ఇప్పుడు ఎందులో డిపాజిట్ చేయాలో తెలియక చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు సరైన నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. అలాంటి వారందరికీ ఐడీబీఐ బ్యాంక్ (×ణదీ× దీుఅఎ) అదిరే శుభవార్త చెప్పింది. అధిక వడ్డీ రేట్లు ఆఫర్ చేసే ఉత్సవ్ ఎఫ్‌డీ స్కీమ్ మళ్లీ తీసుకొచ్చింది. ఈ స్కీమ్‌లో ఇన్వెస్ట్ చేసే గడువును మార్చి 31, 2026 వరకు పొడిగించినట్లు అధికారిక వెబ్‌సైట్లో పేర్కొంది. మరి ఇందులో వడ్డీ రేట్లు, రూ.5 లక్షలకు ఎంతొస్తుంది? అనే వివరాలు తెలుసుకుందాం.

**555 రోజుల ఉత్సవ్ ఎఫ్‌డీ స్కీమ్**

ఉత్సవ్ ఎఫ్‌డీ స్కీమ్‌లో భాగంగా 555 రోజుల మెచ్యూరిటీ టెన్యూర్ ద్వారా జనరల్ కస్టమర్లకు 6.40 శాతం వడ్డీ రేటును బ్యాంక్ ఆఫర్ చేస్తోంది. అలాగే సీనియర్ సిటిజన్లకు 50 బెసిస్ పాయింట్లు అదనంగా అంటే 6.90 శాతం మేర వడ్డీ ఇస్తోంది. ఇందులో రూ.5 లక్షలను జమ చేసినట్లయితే జనరల్ కస్టమర్లకు మెచ్యూరిటీ తర్వాత చేతికి రూ.5,49,180 వరకు అందుతాయి. అదే 60 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్ అయినట్లియితే చేతికి రూ. 5,53,000 వరకు లభిస్థాయి.

**700 రోజుల ఉత్సవ్ ఎఫ్‌డీ స్కీమ్**

ఉత్సవ్ ఎఫ్‌డీ పథకంలో భాగంగా రెండో స్కీమ్ 700 రోజుల మెచ్యూరిటీ పీరియడ్‌తో అందిస్తోంది. ఈ స్కీమ్ ద్వారా జనరల్ కస్టమర్లకు 6.45 శాతం వడ్డీ ఇస్తుండగా, సీనియర్ సిటిజన్లకు అయితే 6.95 శాతం మేర వడ్డీ అందిస్తోంది. ఇక ఇందులో రూ.5 లక్షలను జమ చేసినట్లయితే మెచ్యూరిటీ తర్వాత జనరల్ కస్టమర్లకు అసలు, వడ్డీ కలిపి మొత్తం రూ. 5,62,450 వరకు వస్తాయి. అదే ఒక సీనియర్ సిటిజన్ (60 ఏళ్ల వయసు దాటిన వ్యక్తి) అయితే మెచ్యూరిటీ తర్వాత చేతికి రూ. 5,67,300 వరకు లభిస్తాయి. ఐడీఎఫ్‌సీ ఉత్సవ్ ఎఫ్‌డీ స్కీమ్‌లో ప్రీమెచ్యూర్ విత్ డ్రాకు అనుమతి ఉంటుంది. అలాగే ఎన్ఆర్ఓ, ఎన్ఆర్ఈ టర్మ్ డిపాజిట్లకు స్టాఫ్, సీనియర్ సిటిజన్, సూపర్ సీనియర్ సిటిజన్లకు అందించే రేట్లు వర్తించవు. మిగిలిన అన్ని టర్మ్ డిపాజిట్ల ఫీచర్లు, షరతులు, నిబంధనలు వర్తిస్తాయని బ్యాంక్ తెలిపింది. అయితే ప్రీమెచ్యూర్ డిపాజిట్ చేసినప్పుడు కొంత వడ్డీ కోత పడుతుంది.

# ఒకటో తేదీ గుడ్‌న్యూస్.. తగ్గిన వాణిజ్య సిలిండర్ ధర..



హోలీ పండుగకి ముందే శుభవార్త అందింది. మార్చి 1వ తేదీన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గిస్తున్నట్లు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రకటించాయి. ఈ తగ్గింపుతో మెట్రో నగరాల్లో గ్యాస్ వినియోగదారులకి ఉపశమనం కలగనుంది. డొమెస్టిక్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. ఈ క్రమంలో హైదరాబాద్ సహా రేట్లు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు ఒకటో తేదీన శుభవార్త లభించింది. మార్చి 1వ తేదీన దేశంలోని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు శుభవార్త చెప్పాయి. గ్యాస్ సిలిండర్ ధరలని సవరించాయి. హోలీ పండుగకి ముందే గ్యాస్ వినియోగదారులు ఉపశమనం లభించింది. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గిస్తున్నట్లు ఈ రోజు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రకటించాయి. తాజా నిర్ణయంతో గ్యాస్ వినియోగదారులకి కొత్త ఊరట లభించినట్లయింది. దేశంలోని మెట్రో నగరాల్లో 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధరని రూ. 31 మేర తగ్గిస్తున్నట్లు ఆయిల్ కంపెనీలు ప్రకటించాయి. సవరించిన ఈ కొత్త గ్యాస్ సిలిండర్ ధరలు మార్చి 1 నుంచే అమల్లోకి వస్తాయని తెలిపాయి. అయితే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదని వెల్లడించాయి. సాధారణంగా చమురు మార్కెటింగ్ కంపెనీలు ప్రతి నెలా 1వ తేదీన వంట గ్యాస్ సిలిండర్ ధరలను సమీక్షిస్తాయి. ధరలు పెంచడం లేదా తగ్గించడం లేదా యథాతథంగా కొనసాగించడం వంటివి చేస్తుంటాయి. ఇలా సవరించిన గ్యాస్ సిలిండర్ ధరలు ప్రతి నెలా 1వ తేదీ నుంచి అమలులోకి తీసుకొస్తుంటాయి. అంతర్జాతీయ చమురు ధరలు, ట్యాక్సేషన్ పాలసీలు, సరఫరా - డిమాండ్ వంటి కారణాలతో గ్యాస్ సిలిండర్ ధరలను నిర్ణయిస్తారు.

# ఇన్వెస్టర్లను ముంచేసిన మార్కెట్లు.. ఒక్కరోజే రూ.10 లక్షల కోట్లు లాస్..

దేశీయ స్టాక్ మార్కెట్లు మరోరోజు భారీగా పడిపోయాయి. స్టాక్ మార్కెట్లపై ఇరాన్ యుద్ధం, చమురు ధరల పెరుగుదల ప్రభావం స్పష్టంగా కనిపించింది. దీంతో సెన్సెక్స్ ఏకంగా 1500 పాయింట్ల మేర పడిపోయింది. దీంతో ఇన్వెస్టర్ల సంపద ఒక్కరోజే రూ.10 లక్షల కోట్లు ఆవిరైపోయింది. కీలక రంగాల్లోని షేర్లు భారీగా పడిపోయాయి. మరి ఆ వివరాలు తెలుసుకుందాం. దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో పాటు విదేశీ మదుపరులు భారీగా విక్రయాలకు దిగడంతో దేశీయ సూచీలపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో మార్కెట్లు వరుసగా మూడో రోజూ భారీ నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ ఒక దశలో 1500 పాయింట్లకు పైగా నష్టపోయింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీలోని నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ. 10 లక్షల కోట్లు ఆవిరైపోయింది. దీంతో కంపెనీల మొత్తం విలువ రూ. 429 లక్షల కోట్లకు పడిపోయింది. పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రమవడంతో మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. చమురు ధరలు ట్రంప్ ప్రకటనతో తగ్గినా మళ్లీ పుంజుకున్నాయి. మళ్లీ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర 100 డాలర్లు దాటింది. హోర్మజు జలసంధిపై ఆంక్షలు కొనసాగుతుండడంతో ఆయిల్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. యుద్ధం ముగిసే వరకు ఈ మార్గం మూసే ఉంటుందని



ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ ప్రకటన చేయడంతో ఒక్కసారిగా ధరలు పెరిగాయి. దీంతో రూపాయి విలువ ఆల్ టైమ్ కనిష్ఠానికి పడిపోయింది. దేశీయ మార్కెట్ల నుంచి విదేశీ మదుపరులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవడమూ మార్కెట్లు భారీగా పడిపోయందుకు కారణమైనట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# అసలు హెరిటేజ్ ఫుడ్స్ స్టాక్‌కు ఏమైంది?

దేశీయ స్టాక్ మార్కెట్లలో కొన్ని సెషన్లుగా భారీ నష్టాలు నమోదవుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మార్చి 9న బీఎస్ఈలో దాదాపు 875 స్టాక్స్ ఆల్ టైమ్ కనిష్ఠాల్ని నమోదు చేశాయి. వీటిల్లో టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ వంటి బ్యాంకులతో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ డెయిరీ సంస్థ హెరిటేజ్ ఫుడ్స్ కూడా ఉంది. ఇది సోమవారం రోజు రూ. 294.40 వద్ద 52 వారాల కనిష్ఠాన్ని తాకింది. గరిష్ఠాల నుంచి 45 శాతం వరకు పడిపోయింది. భారత స్టాక్ మార్కెట్లు కొంత కాలంగా తీవ్ర ఒడుదొడుకుల్ని ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు మార్కెట్లను పడేస్తున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధం, మధ్యలో అమెరికా ఎంట్రీ నేపథ్యంలో క్రూడాయిల్ రేట్లు విపరీతంగా పెరుగుతున్నాయి. కిందటి రోజు మార్చి 9న ఒక దశలో 4 సంవత్సరాల గరిష్ఠాన్ని తాకింది. గత వారం సెన్సెక్స్ 3300 పాయింట్లకుపైగా పడిపోగా.. సోమవారం సెషన్‌లో కూడా సెన్సెక్స్ 1300 పాయింట్లకుపైగా తగ్గింది. ఈ క్రమంలోనే దీూజు ఇండెక్స్‌లో ఇంట్రాడేలో సోమవారం ఒక్కరోజే 875 వరకు స్టాక్స్ 52 వారాల కనిష్ఠ స్థాయిల్ని తాకాయి.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.